టెంపోరావ్
బూట్ లెగర్ బుచ్చయ్య



శ్రీనివాసన్ స్కూటర్ని లజ్‌లో ఆపి దిగాడు. నలువైపులా ఫ్లోరసెంట్ లైట్లు ప్రకాశవంతంగా వెలుగుతున్నాయి. ఎటుచూసినా షాపులు!

బస్సులూ, కార్లూ దూసుకుపోతున్నాయి. శ్రీనివాసన్ పేవ్‌మెంటు మీద నిలబడి సిగరెట్ వెలిగించాడు. పొగ వదుల్తూ ప్రవాహంలా కదిలే ప్రజలనూ, వాహనాలనూ చూస్తున్నాడు.

టైం చూశాడు. తొమ్మిదింకా కాలేదు. లుంగీ, పొట్టిచేతుల చొక్కా ధరించిన ఒక నల్లటివ్యక్తి అతడి పక్కనుంచి వెళ్తూ ఎందుకో ఆగాడు.

పిక్‌పాకెట్ ఏమో అనుకున్నాడతను.

"బాటిల్ సార్!" అన్నాడతను తగ్గుస్వరంలో.

అతడివంక శ్రీనివాసన్ పరీక్షగా చూశాడు.

"ఏం బాటిల్ ?"

"గోల్కొండ బ్రాండీ, సార్. హాఫ్ బాటిల్."

"ఎంత ?"

"యాభై రూపాయలు సార్."

"కల్తీలేని సరకేనా ?"

"ఒకసారి తాగిచూస్తే మీకే తెలుస్తుంది. మంచి స్టాకు సార్," అన్నాడతను.

తమిళనాడులో ప్రొహిబిషన్ మూలంగా బ్రాండీ, విస్కీ, రమ్ మొదలగు మత్తు ద్రవాలు సులువుగా దొరకవు ఆ వ్యక్తి బాటిల్ గురించి చెప్పగానే శ్రీనివాసన్ ఆశ్చర్యపోయాడు.

అతడి వయస్సు ముప్ఫయి ఏళ్లు. ఒక టెలివిజన్ కంపెనీలో అతడు సేల్స్ ప్రమోటర్‌గా పనిచేస్తున్నాడు. బయటి రాష్ట్రాలకు వెళ్లినప్పుడు తప్పక తాగుతూ వుంటాడు. మద్రాస్ పట్నంలో దొరుకుతున్న యీ అవకాశాన్ని పోగొట్టుకోకూడదని అతడు నిశ్చయించుకున్నాడు.

"బాటిల్ని నేను చూడాలి," అన్నాడతను.

"ఇక్కడ చూపించలేను." అలా వెళ్దాం రండి," అన్నాడతను.

ఇద్దరూ రోడ్డు దాటారు. ఒక స్ట్రీట్‌లైట్ కింద నిలబడ్డారు. సమీపంలో ఎవ్వరూ లేరు. బనీను అడుగునుంచి అతడొక బాటిల్‌ను తీసి శ్రీనివాసన్‌కిచ్చాడు.

లైట్ కాంతిలో బాటిల్ని అతడు జాగ్రత్తగా పరిశీలించాడు. సీల్డ్ బాటిల్, గోల్కొండ బ్రాండీ! కల్తీ సరకులా లేదు. ఇంతకు ముందు ఎన్నిసార్లో ఆ బ్రాండీ తాగిన శ్రీనివాసన్‌కి నమ్మకం ఏర్పడింది. "నువ్వు ప్రతిరోజూ యీ ప్రాంతంలో ఉంటావా ?" అడిగా డతను.

అతడు వెంటనే జవాబివ్వలేదు.

"నాకు యీ సరకు మళ్ళీ మళ్ళీ కావలసి వుంటుంది. అందుకని అడుగుతున్నాను," అన్నాడతను.

"వుంటాను, సార్."

పర్స్ తెరిచి యాభైరూపాయలు అతడి కిచ్చాడు శ్రీనివాసన్. అతను గబగబా వెళ్ళిపోయాడు.

శ్రీనివాసన్ పేవ్‌మెంటమ్మట నడిచాడు. బాటిల్ భద్రంగా ప్యాంటుజేబులో ఉంచి. ఒక హోటల్లో కెళ్ళి అతడు మిక్చర్. పకోడీల పొట్లాలు కొన్నాడు. హుషారుగా రోడ్డు కటువైపున్న స్కూటర్ ముందుకు నడిచాడు. క్షణంలో స్కూటర్ రోడ్డమ్మట దూసుకుపోయింది.

*　　　*　　　*

రామారావు, గోపాలం పేవ్‌మెంటు మీదనుంచి పక్కకు కదిలారు. కొంచెం దూరంలోవున్న గుడిసెలోకి రహస్యంగా దూరారు.

గుడిసెలో హరికెన్ లైటు వెల్గుతోంది. పొట్టిగా, లావుగావున్న ఒకతను వాళ్ళవైపు చూశాడు. అతడు ధరించిన తెల్లటి షర్టు లైటుకాంతిలో మెరుస్తోంది. అతడి చేతికి ఖరీదైన సీకో వాచ్ వుంది.

"ఏం కావాలి సార్ ?"

"మెక్‌డోవల్ బ్రాందీ, రెండు హాఫ్ బాటిల్స్," అన్నాడు రామారావు.

మూలగా వున్న ఒక కర్రపెట్టెలోంచి అతడు రెండు బుడ్డీలను తీసి వాళ్ళ కిచ్చాడు.

"నూట యిరవై రూపాయలు," అన్నాడతను.

అతడు అడిగిన ప్రకారం వాళ్లు డబ్బిచ్చారు. బాటిల్స్‌ను ప్యాంటు జేబుల్లో దాచుకొని వాళ్లు హుషారుగా వెళ్లిపోయారు.

గుడిసె బయట నిలబడి అతను వాళ్లవైపే చూస్తున్నాడు. ఎవరో గుడిసె వైపు వస్తున్నారు. అతడి వయస్సు యాభై పైగా వుంటుంది. ఖరీదైన సూటులో వున్నాడతను.

గుడిసె ముందున్నతను సూటుమనిషి వంక ప్రశ్నార్థకంగా చూశాడు.

"ఇక్కడ బాటిల్స్ దొరుకుతాయని విన్నాను," అన్నాడతను.

"ఎవరో చెప్తే విన్నారా?" అడిగాడు గుడిసెముందున్న వ్యక్తి.

"నా ఫ్రెండ్ రామన్ చెప్పాడు."

"లోపలకు రండి," అన్నాడు అతను.

సూటుమనిషి లోపలకు వెళ్లాడు. హరికెన్ లైట్ డిమ్ కాంతిలో గుడిసె నలువైపులా చూశాడు.

"ఏం కావాలి సార్ ?"

"బ్రాందీ, విస్కీ ఏదైనా సరే - నాకు ఎక్కువగా కావాలి. మేరేజి పార్టీ," అన్నాడతను.

"మెక్‌డోవల్ ఫుల్ బాటిల్ 120 కి యిస్తాను."

"పది బాటిల్స్ కొంటాను. ధర తగ్గించాలి." బేరమాడాడు, సూటుమనిషి.

"ఐదు రూపాయలు తగ్గించుకోండి."

"అలాగే."

అతడు బాటిల్స్ తేడానికి క్రేటపెట్టె దగ్గరకు వెళ్లాడు. సూటుమనిషి రెండడుగులు ముందుకేశాడు.

"నాకు కావలసిన స్టాకు దొరికినందుకు సంతోషంగా వుంది. నీ పేరేమిటి?"

"దొరైరాజ్" అన్నాడతను.

దొరైరాజ్ పది బుడ్లను ఒక అట్టపెట్టెలో పెట్టాడు.

"నే నొక బాటిల్ని చూడొచ్చా ?"

ఒక బాటిల్ని తీసి అతడు సూటుమనిషి కిచ్చాడు.

అతడు బాటిల్ని పరీక్షించాడు. కల్తీ సరకులా లేదు.

"తొందరగా డబ్బివ్వండి!" వెయ్యీ నూట యాభై," అన్నాడు దొరైరాజ్.

సూటుమనిషి చెయ్యిని కోటుజేబులోకి పోనిచ్చాడు. పైకొచ్చిన అతడి చేతిలో పిస్టల్ మెరుస్తోంది.

"దొరైరాజ్! నిన్ను అరెస్టు చేస్తున్నాను!" గర్జించాడతను.

దొరైరాజ్ రెండుసార్లు దగ్గాడు. ఎవరో సూటుమనిషిని వెనకనుంచి బలంగా లాగారు. సూటుమనిషి బోర్లా ముందుకుపడ్డాడు

పిస్టలున్న అతడిచేతిమీద దొరైరాజ్ కాల్తో గట్టిగా తొక్కాడు. గుడిసెలో చాలామంది గుమిగూడారని సూటుమనిషి గ్రహించాడు

అతడి చేతిలోని పిస్టల్ని దూరంగా తన్నాడు దొరైరాజ్.

అతడిని లేవదీసి కాల్తో పొట్టలో తన్నాడు. అతడు దూసుకుంటూ వెనక్కి వెళ్లాడు. వెనకనుంచి ఎవరో తన్నారు. అతడు ముందుకు పడ్డాడు.

"నన్ను అరెస్టు చేస్తాడట!" అర్చాడు దొరైరాజ్.

గుడిసెలో వొచ్చిన పరదజనుమంది దొరైరాజ్ వ్యంగ్యంగా అన్న మాటలు విని నవ్వారు. "వీడు పోలీసోడిలా వున్నాడు. సఫా చేసెయ్యండి !" అర్చాడతను.

సూటుమనిషి బాధతో మూలుగుతున్నాడు. తటాలున అతడి వీపులోకి కత్తి దిగింది. ఒకడు అతడి నోరును నొక్కేశాడు అతడి చావుకేక బయటకు వినపడలేదు.



గుడిసె బయట యిద్దరు మనుషులు కాపలా వున్నారు. సూటుమనిషి చుట్టూ వున్నవాళ్లు దూరంగా జరిగారు.

గ్లాసుల్లో పోసుకొని వాళ్లు తాగుతున్నారని కొనవూపిరితో వున్న సూటుమనిషి గ్రహించాడు. సమీపంలో నేలమీద పడున్న బాటిల్ని అతడి చెయ్యి చుట్టేసింది. అతడు పక్కకు కదిలాడు.

"శవాన్ని ఏంచేద్దాం ?" అన్నారెవరో.

"ఎక్కడేనా పారేయండి. మనమీదకు అనుమానం రాకూడదు. వీడిక్కడికి ఎలా వచ్చాడో చూడండి. కారులో వచ్చుంటే దానిలోనే వాడి శవాన్ని పడేసి పట్టుకుపోవచ్చు," అన్నాడు దొరైరాజ్.

"చూస్తాం," అన్నా డొకతను.

* * *

2

గిరి ఎక్స్ వై జెడ్ కారును పోనిస్తున్నాడు. పక్కనే కూర్చున్నాడు వాలి. ఆజానుబాహుడు, కండలు తిరిగిన శరీరం, బుగ్గమీసాలు, కాంతివంత మైన కళ్లు. అతడినోట్లో వున్న పొడుగాటి చుట్ట కాల్తోంది. పొగవదుల్తూ అతడు ఆలోచిస్తున్నాడు.

క్లాక్ టవర్ సమీపంలో పోలీస్ జీప్ ఆగివుంది. ప్రజలు గుంపులుగా నిలబడివున్నారు. పోలీసులు పెక్కుమంది వున్నారు.

కారును జీప్ వెనుక ఆపాడు గిరి. వాలి కిందకు దిగాడు. ఇన్‌స్పెక్టర్ కేశవన్ గబగబా వచ్చి వాలికి నమస్కరించాడు.

రోడ్డు వారగా పాతబడిన ఆస్టిన్ కారు ఆగివుంది. కారు ముందుసీటుమీద ఒకతను బోర్లా పడున్నాడు. అతడు ధరించిన కోటు ఎర్రబడి వుంది, వెనుకనుంచి కత్తితో పొడిచుండాలి! కత్తి కోటును చీల్చుకొంటూ లోపలకు పోయింది.

"ఇత నెవరో తెలిసిందా ?" అడిగాడు వాలి.

"ఇన్‌స్పెక్టర్ పీటర్ సార్. ప్రొహిబిషన్ డిపార్టుమెంటు తరపున పనిచేస్తున్నాడు. మఫ్టీతో వెళ్ళి దొంగసారా అమ్మే రహస్య స్థావరాలను పరికిస్తూ వుంటాడు," అన్నాడు యిన్‌స్పెక్టర్.

ఇన్‌స్పెక్టర్ పీటర్ కోటుజేబులను వాలి తడిమి చూశాడు. ఒక జేబులో క్వార్టర్ విస్కీ బాటిల్ వుంది. సీలు పగల్లేదు.

బాటిల్ని వాలి పరీక్షగా చూశాడు. ఆంధ్రరాష్ట్రంలో ఒక పేరుపొందిన కంపెనీ తయారుచేసిన విస్కీ అది !

"కేశవన్ భాయ్! పీటర్‌కు తాగే అలవాటుందా ?" ప్రశ్నించాడు వాలి.

"పీటర్ తాగరు, సార్. ఒకప్పుడు తాగేవారు. తర్వాత పూర్తిగా మానేశారు. మద్యపానం అంటే ఆయనకు అసహ్యం. ఎన్నో కుటుంబాలు దాని మూలంగా చితికిపోయి, నాశనమవుతున్నాయని ఆయన అభిప్రాయం," అన్నాడు కేశవన్.

మరో జేబులో పర్స్ వుంది. పర్స్‌లో యిరవై రూపాయలు, అరవై పైసలు చిల్లర కనిపించింది.

"ప్రొహిబిషన్ అఫెండర్స్‌ను పట్టుకోడానికి వెళ్ళే యితని దగ్గర పిస్టల్ లేకపోవడం విచిత్రంగా వుంది," అన్నాడు వాలి.

"ఆయన జేబులో పిస్టల్ ఎప్పుడూ వుంటుంది," అన్నాడు కేశవన్.

శవాన్ని పైకెత్తి కారు సీటును వాలి పరీక్షించాడు. సీటుమీద రక్తం మరకలు లేవు!

చుట్టపొగ వదుల్తూ వాలి క్షణకాలం ఆలోచిస్తూ వుండిపోయాడు. ఇన్‌స్పెక్టర్ కేశవన్, అసిస్టెంట్ గిరి అతడి పక్కనే వున్నారు.

"కేశవన్ భాయ్! పీటర్ కార్లో యిక్కడ మరణించలేదు. ఎక్కడో

అతడిని చంపి, కారులో శవాన్ని తెచ్చి యిక్కడ వదిలేసి వుండాలి," అన్నాడు వాలి.

"అలాగే కనిపిస్తోంది, సార్" అన్నాడు యిన్‌స్పెక్టర్.

"ఇన్‌స్పెక్టర్! పీటర్ మత్తుద్రవా లమ్మే రహస్య స్థలానికి వెళ్లుంటాడు. అతడు బ్రతికుంటే తమకు ప్రమాదమని గుర్తించి బూట్‌లెగ్గర్స్ పీటర్ని హతమార్చారు. తనెక్కడి కెళ్లిందీ మనకు సూచించడంకోసం యీ క్వార్టర్ బాటిల్ని అతడు జేబులో పడేసుకొని వుంటాడు," అన్నాడు వాలి

"వాలిగారూ, సమీపంలోవున్న యితర రాష్ట్రాలనుంచి మత్తుద్రవాలను స్మగుల్ చేసేవాళ్లను ధ్వంసం చెయ్యాలి! అంతవరకూ పీటర్ ఆత్మకు శాంతి చేకూరదు!" అన్నాడు ఇన్‌స్పెక్టర్ కేశవన్ వుద్రేకంగా.

వాలి సూటిగా ఇన్‌స్పెక్టర్ వంక చూశాడు. "కేశవన్ భాయ్, బూట్‌లెగ్గర్స్ అన్నిటికీ తెగించిన వ్యక్తులు. వాళ్ల తోవకు అడ్డొచ్చినవాళ్లను నిర్దాక్షిణ్యంగా నిర్మూలిస్తారు!"

"వాలిగారూ! యిటువంటి ఘోరాలు జరగకుండా మనం జాగ్రత్తపడాలి," అన్నాడు కేశవన్.

వాలి మాట్లాడకుండా తన కారువద్దకు నడిచాడు. గిరి స్టీరింగ్ వీల్ వెనక కూర్చున్నాడు పక్కనే కూర్చొని వాలి తలుపుమూశాడు.

బయట నిలబడిన ఇన్‌స్పెక్టర్ కేశవన్‌వైపు అతడు నవ్వుతూ చూశాడు.

"కేశవన్ భాయ్! నేరస్తులు నేరాలు చేస్తూనే వుంటారు. ఎప్పుడో అప్పుడు మనకు చిక్కుతారు, డోంట్ వర్రీ," అన్నాడు వాలి.

గిరి కారును పోనిచ్చాడు. కారు స్పీడుగా ప్రయాణం చేస్తోంది.

"అతడి దగ్గరున్న పిస్టల్ ఏమై వుంటుంది?" అడిగాడు గిరి.

"అతడిని చంపినవాళ్లు లాక్కొని వుండాలి!"

"చాలామంది అతడిని చుట్టుముట్టారని మీ రెందు కనుకుంటున్నారు?"

"పీటర్ బలమైన మనిషి. అతడు ఎవరితోనో పోట్లాడుతూవుండగా మరెవరో వెనకనుంచి పొడిచుండాలి! అందువలన ఎక్కువమందితో అతను పోరాడాడని మనం అనుకోవాలి," అన్నాడు వాలి.

హోటల్ అశోక్ కాంపౌండ్‌లో కారు ఆగింది. కిందకు దిగి వాలి ముందు హాల్లోకి నడిచాడు. కిందిభాగంలో వున్న తన గదివైపు పెద్ద అంగల్లో కదిలాడు.

* * *

3

ఏర్‌కండిషన్డ్ గదిలో చల్లగా వుంది. గది అందంగా అలంకరించబడింది. గదిలో ఖరీదైన సోఫా లున్నాయి. మరోవైపున గాడ్‌రెజ్ స్టీల్ టేబుల్, కుర్చీలు వున్నాయి.

ఒక సోఫాలో కూర్చుని వున్నాడు బూట్‌లెగ్గర్ బుచ్చయ్య.

పొట్టిగా, లావుగా వున్నాడతను. అతడు ధరించిన పాంట్, స్లాక్ ధగధగా మెరుస్తున్నాయి. కుడిచేతికి ఖరీదైన వాచ్ వుంది. ఎడంచేతిమీద బంగారు కంకణం మెరుస్తోంది.

బుచ్చయ్య వయస్సు నలభై దాటి ఉంటుంది. మొహంనిండా మసూచికం మచ్చలు! నల్లటి మనిషి. అతడి ఎదురుగా దొరైరాజ్ నిలబడి వున్నాడు.

"ఏం జరిగింది ?" అడిగాడు బుచ్చయ్య.

"అతడు మామూలు కస్టమరు అనుకున్నాను బాస్. పిస్టల్‌తో నన్ను బెదిరించాడు. నేను గట్టిగా దగ్గగానే మన మనుషులు లోన కొచ్చారు. సింహాలు అతడిని వెనకనుంచి పొడిచేశాడు," అన్నాడు దొరైరాజ్.

"గుడ్‌వర్క్."

"శవాన్ని అతడి కారులో పడేసి క్లాక్‌టవర్ ప్రాంతంలో మన మనుషులు వదిలేశారు."

"అతడెవరో తెలిసిందా ?"

"ఇన్‌స్పెక్టర్ పీటర్ అని ప్రజలు చెప్పుకుంటున్నారు." బుచ్చయ్య క్షణకాలం ఆలోచించాడు.

"అతడు నీ గుడిసెలోకి వస్తూంటే ఎవరేనా చూసుంటారా ?'' అడిగాడతను.

"ఎవరేనా చూసివుండొచ్చు !"

"పోలీసు ఆఫీసర్ మరణిస్తే తరిమ్మా పోలీసువాళ్లు కక్షగట్టి మనమీద పగ సాధించడానికి ప్రయత్నిస్తారు. బి కేర్‌ఫుల్ !" అన్నాడతను.

గ్లాసులో స్కాచ్ విస్కీ పోసుకుని సోడా కలిపాడతను. గడగడ విస్కీ తాగేసి బుచ్చయ్య సిగరెట్ వెలిగించాడు.

"ఏ మార్పులేనా అవసరమైతే నీకు కబురుచేస్తాను. కొన్నిరోజులపాటు ఎలర్ట్‌గా వుండు," అన్నాడు బుచ్చయ్య.

అతడికి వినయంగా దొరైరాజ్ నమస్కరించాడు.

"ఈ రాత్రి కొత్తస్టాక్ రెండు లారీల్లో బెంగుళూరునుంచి వస్తుంది. ఇక్కడి ప్రజలకు ఏ కరువూ లేకుండా మనం చూడాలి ," అన్నాడు బుచ్చయ్య.

"అలాగే బాస్," అని దొరైరాజ్ వెళ్లిపోయాడు.

టెలిఫోన్ మ్రోగింది. అతడు రిసీవరెత్తి "హలో !" అన్నాడు.

"బాస్, కిషోర్ రిపోర్టింగ్. నేను క్లాక్‌టవరు దగ్గర వున్నాను. ప్రఖ్యాత డిటెక్టివ్ వాలిగారొచ్చి ఇన్‌స్పెక్టర్ పీటర్ శవాన్ని చూసివెళ్లారు."

"వాలిగారా ?" అన్నాడు బుచ్చయ్య ఆశ్చర్యంగా.

"యస్, బాస్."

"ఆయన డేంజరస్ మేన్. మనం చాలా జాగ్రత్తగా వ్యవహరించాలి," అన్నాడతను.

కిషోర్ చెప్పిన మరి కొన్ని విషయాలు విని అతడు రిసీవర్ని పెట్టేశాడు. అతడి మెదడులో ఆలోచనలు తిరుగుతున్నాయి.

* * *

4

ఆకాశంలో అర్ధచంద్రుడు నీరసంగా కనిపిస్తున్నాడు. నక్షత్రాలు మినుకు మినుకుమంటున్నాయి.

రెండు లారీలు రోడ్డువారగా ఆగాయి. ఒక ఫియట్ కారొచ్చి వాటిపక్కనే ఆగింది. కారులో ఐదుగురు మనుషులున్నారు.

లారీ డ్రయివర్లు కారుపక్కకు వచ్చారు. వెనుకసీటుమీద కూర్చున్న జాన్ వాళ్లవైపు నవ్వుతూ చూశాడు.

"పైన చెక్‌పోస్టు వస్తోంది. మీరు ధైర్యంగా వుండండి. ఏదేనా ప్రమాదం వస్తే మేం వెంటనే మీకు సహాయపడ్తాం," అన్నాడు జాన్.

డ్రయివర్లు తలలూపి లారీల దగ్గరకు వెళ్లారు. ఫియట్‌కారు ముందుకు వెళ్లిపోయింది.

చెక్‌పోస్టుముందు రెండు లారీలు ఆగాయి. గోల్డెన్ లారీ సర్వీస్ అని పెద్ద అక్షరాల్లో లారీలమీద రాయబడివుంది.

చెక్‌పోస్టులో అరడజనుమంది వున్నారు. లారీలను పైపైన చూసి వాళ్లు పోనిచ్చారు. రెండు లారీలూ రోడ్డమ్మట దూసుకుపోతున్నాయి.

రెండు ఫర్లాంగులు దాటాక పోలీస్‌జీప్ లారీలకు ఎదురైంది. ఆపమని పోలీసులు డ్రయివర్‌కు సౌంజ్ఞచేశారు.

రెండులారీలూ ఆగాయి. సబిన్‌స్పెక్టర్ శివరామ్ నలుగురు కానిస్టేబుల్స్‌తో సహా లారీలదగ్గరకొచ్చారు. "చెక్ ది లారీస్ !" అన్నాడు శివరామ్.

కానిస్టేబుల్స్ రెండు లారీలను చెక్ చేస్తున్నారు. ఒక డీల్‌వుడ్ పెట్టెను తెరిచి చూశాడు కానిస్టేబుల్. అందులోవున్న బ్రాందీ బుడ్డీలను చూసి అతడు గట్టిగా అర్చాడు, "బ్రాందీ బాటిల్సు, సార్ !"

సబిన్‌స్పెక్టర్ శివరామ్ లారీ ఎక్కి పెట్టెలోవున్న బ్రాందీబుడ్డీలను చూశాడు. అమాంతంగా కిందకు దూకాడు

ఇద్దరు డ్రయివర్లూ, క్లీనర్లూ రోడ్డువారగా నిలబడి బీడీలు పీలుస్తున్నారు.

"పదండి, మా జీప్ వెనక," అన్నాడు సబిన్‌స్పెక్టర్.

కారు హెడ్‌లైట్ల కాంతి వాళ్ళమీద పడింది. ఒక ఫియట్ కారొచ్చి వాళ్ళ పక్కనే ఆగింది

తటాలున తలుపులు తెరిచి ఐదుగురు బయటకు దూకారు. సబిన్‌స్పెక్టర్ని చుట్టేశారు.

"ఏమిటి గొడవ ?" అడిగాడు జాన్.

జాన్ ఎలుగుబంటిలావున్నాడు. సూటు ధరించాడు. "మిస్టర్, ఇది నీకు సంబంధించిన విషయం కాదు. నీ కారు చెక్ చెయ్యాలి," అన్నాడు సబిన్‌స్పెక్టర్.

బెల్ట్ హోల్డర్‌లో వున్న రివాల్వర్ని బయటకు తీయబోయాడు శివరామ్. అతని గడ్డం జాన్‌దెబ్బకు పగిలింది. అతడు వెనక్కి పడ్డాడు.

శివరామ్ రివాల్వర్ని జాన్ లాక్కున్నాడు. జాన్ కోపంగా నేలమీద పడున్న శివరామ్‌వైపు చూశాడు.

"మమ్మల్ని ఆపితే నువ్వు చిక్కుల్లో పడ్తావు. మాతో సహకరిస్తే నీకు లాభిస్తుంది," అన్నాడు జాన్.

"ప్రాణంపోయినా మీకు నేను తలొంచను. ఆఖరిదాకా మీతో పోట్లాడతాను," అన్నాడు శివరామ్.

జాన్ పకపక నవ్వాడు. నేలమీదున్న సబిన్‌స్పెక్టర్ వైపు రెండుసార్లు షూట్‌చేశాడు. శివరామ్ అరుస్తూ కళ్ళుమూశాడు.

నలుగురు కానిస్టేబుల్సూ చేతులెత్తి వణుకుతూ నిలబడ్డారు.

"వాళ్ళపేర్లూ, అడ్రెస్‌లూ రాసుకోండి," అన్నాడు జాన్.

కానిస్టేబుల్ల పేర్లూ, అడ్రెస్‌లూ ఒకతను రాసుకున్నాడు. జాన్ వాళ్ళవంక చూశాడు.



"ఈ లారీలు ఏ కంపెనీకి చెందినవో మీరు చూశారు. ఆ కంపెనీ పేరు బయటపెడ్తే మీ యిళ్ళకొచ్చి మిమ్మల్నీ, మీ భార్యలనూ, పిల్లల్నీ హతమారుస్తాం," అన్నాడు జాన్.

జాన్ రూపంచూస్తే అతడు చెప్పింది చేస్తాడనే భయం అందరిలోనూ తలెత్తుతుంది!

"మేం చెప్పం సార్," అన్నాడొక కానిస్టేబులు.

"మరోగంటదాకా యిక్కడే వుండండి. ప్రాణాల్తో మిమ్మల్ని వదుల్తున్నాను. నాతో చెప్పినట్లు మీరు చెయ్యకపోతే పగ సాధిస్తాం."

సబిన్‌స్పెక్టర్ శవాన్ని పొదపక్కగా పారేయించి, జాన్ ఫియట్‌కార్లో కూర్చున్నాడు. బాటిల్లోవున్న రా విస్కీని అతడు కొంచెం తాగి సిగరెట్ వెలిగించాడు.

బయట నిలబడిన డ్రయివర్లవైపు అతడు చూశాడు

"బాలా వేగంగా లారీలను పోనీయండి. గంటలో మద్రాసుపట్టణం సమీపానికి చేరుకోవాలి." హెచ్చరించాడు జాన్.

"అలాగే, బాస్," అన్నాడు డ్రయివర్.

లారీలు కదిలాయి. ఫియట్ వాటినిదాటి వేగంగా ముందుకుపోయింది.

* * *

5

పోలీసుస్టేషన్ వరండాలో బల్లమీదున్న సబిన్‌స్పెక్టర్ శివరామ్ శవాన్ని వాలి పరీక్షగా చూశాడు

శవం పక్కన పూలదండలు కుప్పలుగా పడున్నాయి. ఇరవై రెండేళ్ళ యువతి, యాభై ఏళ్ళ స్త్రీ శవంపక్క కూర్చుని ఏడుస్తున్నారు.

"ఆమె రేవతి, శివరామ్ భార్య. ఆమె శివరామ్ తల్లి," ఇన్‌స్పెక్టర్ సుకుమార్ పరిచయం చేశాడు వాలికి.

జాలిగా వాలి వాళ్ళవైపు చూశాడు.

"నా బిడ్డకు పెళ్ళయి సంవత్సరం యింకా కాలేదు. దుర్మార్గులు వాడిని పొట్టనపెట్టుకున్నారు," అని తల్లి ఏడుస్తోంది.

వాలి పక్కనున్న గిరి వాళ్ళ ఏడ్పును భరించలేక రుమాలుతో కళ్ళు తుడుచుకున్నాడు. రేవతిని ఓదార్చుతూ అతడు పక్కనే కూర్చున్నాడు.

"కానిస్టేబుల్సు ఎక్కడున్నారు?" అడిగాడు వాలి.

ఇన్‌స్పెక్టర్ సుకుమార్ తన గదిలోకి నడిచాడు-వాలి అతడి వెనకనే వెళ్ళాడు.

నలుగురు కానిస్టేబుల్సు గదిలో కొచ్చారు. వాళ్ళవైపు వాలి చిరునవ్వుతో చూశాడు.

"మీరింతమంది వుండి శివరామ్‌ని ఎందుకు చావనిచ్చారు?" వాలి ప్రశ్నించాడు.

"ఆయనది మొండిధైర్యం సార్. మేం ఏదేనా చేసేలోపల వాళ్ల ఆయన్ని కొట్టి చంపేశారు," అన్నాడు కానిస్టేబుల్ శివన్.

"వాళ్ళెవరు?"

"వాళ్ల ఫియట్ కారులో వచ్చారు సార్. మేం కారును చెక్ చేస్తున్నాం. ఈలోపల కార్లోంచి దిగినవాళ్లు ఆయన్ని హతమార్చారు," అన్నాడు కానిస్టేబుల్ గిరిధర్.

"కారులో మీకు ఏదేనా దొరికిందా?"

"కారులో రెండు విస్కీ-బాటిల్సు వున్నాయి. కారులోనివాళ్లు బాగా తాగి వున్నారు."

"వాళ్లను ఆపడానికి మీరెందుకు ప్రయత్నించలేదు ?" అడిగాడు వాలి.

"ఎలా ఆపుతాం సార్ ? మా దగ్గర ఆయుధాలు లేవు. వాళ్ల చేతుల్లో పిస్టల్స్ వున్నాయి," అన్నాడు శివన్.

చుట్ట పొగ వదుల్తూ వాలి ఆలోచిస్తున్నాడు. బెంగుళూరునుంచి రెండు బాటిల్స్‌ను వాళ్లు కారులో తెచ్చుకొంటున్నారా. ఆమాత్రం నేరానికి ఒక నిండు ప్రాణాన్ని బలితీసుకుంటారా ?

"వాళ్ల కారు నంబరు చూశారా ?"

"చీకట్లో మాకు కనపడలేదు, సార్."

"మీ దగ్గర టార్చిలైట్లు ఉండాలే!" అన్నాడు వాలి.

"వాళ్లు వాటిని లాక్కొన్నారు."

"ఇదంతా ఎన్నింటికి జరిగింది ?"

"పన్నెండు ప్రాంతంలో సార్."

"శివరామ్‌ని చంపినవాళ్లు మిమ్మల్ని ఎందుకు వదిలేశారు ?'' ప్రశ్నించాడు వాలి.

"మేం వాళ్లతో పోట్లాడలేదు, సార్. చేతులు పైకెత్తి నిలబడ్డాం,'' అన్నాడు గిరిధర్.

"తన డ్యూటీని నిర్వహిస్తూ ప్రాణాన్నిచ్చాడు శివరామ్. పోలీస్ డిపార్ట్ మెంటులో అతడి పేరు శాశ్వతంగా వుంటుంది. మీరు మీ డ్యూటీలు చెయ్య లేదు ?" అన్నాడు వాలి.

వాళ్లు మాట్లాడలేదు. తలలు వంచుకుని నిలబడ్డారు. శివన్ ఏడుస్తూ వాలి వంక చూశాడు. "మేం పిరికిపందలం కాము సార్. అయినా తెగించి వాళ్ళతో పోట్లాడితే ఒక శవానికి బదులు ఐదు శవాలు మీకు దొరికేవి!" అన్నాడతను.

ఆలోచిస్తూ వాలి గదిలో పచార్లు చేశాడు.

"కారులో రెండు విస్కీ బాటిల్సు తప్ప మరేమీ దొరకలేదా ?" అడిగాడు వాలి.

"లేదు సార్," అన్నాడు గిరిధర్.

అంతవరకూ మాట్లాడని కానిస్టేబుల్సువైపు అతడిచూపు మళ్లింది. ఒకడు వొణుకుతున్నాడు.

"గత రాత్రి చూసినవాళ్ల గుర్తుకొచ్చి వొణుకుతున్నట్లున్నావు ?" అన్నాడు వాలి.

"దీనదయాళ్ వయస్సులో పెద్దవాడు సార్. రాత్రి జరిగింది చూశాక అతడు షాక్ తిన్నట్లు ప్రవర్తిస్తున్నాడు," అన్నాడు శివన్.

కానిస్టేబుల్స్‌ను వెళ్లిపొమ్మన్నాడు వాలి. ఇన్‌స్పెక్టర్ సుకుమార్‌వైపు చూశాడతను.

"శవ పరీక్ష అయిందా ?"

"రాత్రి పన్నెండూ ఒంటిగంట మధ్య శివరామ్ మరణించి వుంటాడని డాక్టర్ రిపోర్టులో వుంది."

"చెక్‌పోస్టు యిక్కడికి ఎంత దూరంలో వుంది ?"

"ఆరు కిలోమీటర్ల దూరంలో."

"సుకుమార్ భాయ్. అక్కడకు వెళ్లి దర్యాప్తు చేద్దాం. హత్య జరిగిన ప్రదేశాన్ని మనం చూడాలి," అన్నాడు వాలి.

వాలి గదిలోంచి బయట కొచ్చాడు. పోలీస్ జీప్, వెనకనే ఎక్స్ వై జెడ్ కారు రోడ్డమ్మట దూసుకుపోయాయి.

చెక్‌పోస్టు ముందు కార్లు ఆపి అందరూ దిగారు. చెక్‌పోస్టు ఇన్‌ఛార్జి రామచంద్రన్‌తో వాలి మాట్లాడాడు.

"గత రాత్రి పన్నెండు ప్రాంతంలో యీ చెక్‌పోస్టు ద్వారా ఏయే కార్లు వెళ్లాయి ?" అడిగాడు వాలి.

"మొదట్లో ఒక అంబాసిడర్ కారు వెళ్లింది. ఆ తర్వాత ఫియట్ కారు వెళ్లింది. వెనువెంటనే రెండు లారీలు వెళ్లాయి," అన్నాడు రామచంద్రన్, రికార్డులు చూసి.

"వాటి నంబర్లు కావాలి," అన్నాడు వాలి.

రామచంద్రన్ చెప్పిన నంబర్లను గిరి డైరీలో రాసుకున్నాడు.

"మీరు వాటిని చెక్ చేశారా ?"

"కార్లను చెక్ చేశాం. వాటిలో మా కేమీ దొరకలేదు. ఆ కంపెనీ లారీలు తరచు వెళ్తూనే వుంటాయి."

"ఏ కంపెనీ అది ?"

"గోల్డెన్ లారీ సర్వీస్ వారి లారీలు."

ఆ కంపెనీ పేరును గిరి రాసుకున్నాడు.

"పన్నెండు తర్వాత మీకు పిస్టల్ కాల్పులు వినిపించాయా ?" అడిగాడు వాలి.

"రెండుసార్లు చప్పుళ్లు వినపడ్డాయి. లారీ టైర్లు బరస్టయి వుండొచ్చు అనుకున్నాం," అన్నాడు రామచంద్రన్.

వాలి కారువైపు నడిచాడు. ఎక్స్ వై జెడ్ కారు కదిలింది. వెనకనే పోలీస్ జీప్ వస్తోంది.

సుకుమార్ సంజ్ఞలను గుర్తించి గిరి కారును ఆపాడు. వాలి కిందకు దిగాడు. సూర్యుడు ప్రకాశిస్తున్నాడు. చల్లటిగాలి వీస్తోంది. రోడ్డు పొడుగునా చెట్లు వున్నాయి. రోడ్డు సమీపంలో పొదలున్నాయి.

ఇన్‌స్పెక్టర్ సుకుమార్ గబగబా వాలి దగ్గర కొచ్చాడు.

"ఇక్కడే పోట్లాట జరిగింది, సార్." అన్నాడు సుకుమార్.

రోడ్డు వారగా ఒకచోట రక్తం మరకలు కనిపిస్తున్నాయి. ఎర్రచీమలు పుట్టలుగా అక్కడున్నాయి.

"శివరామ్ యిక్కడే పడిపోయి ఉండాలి," అన్నాడు వాలి.

ఆ స్థలాన్ని వాలి పరీక్షించాడు. రోడ్డువారగా వున్న నల్లమట్టిమీద టైర్ల గుర్తులున్నాయి. వాటిని జాగ్రత్తగా చూశాడు వాలి. ఒకచోట కొన్ని బీడీ పీకలు పడున్నాయి.

"సుకుమార్ భాయ్, ఫియట్ కారువెళ్ళిన సమీయంలో లారీలు కూడా వెళ్లుండాలి. కానిస్టేబుల్సు వాటిని గురించి ఏమీ చెప్పకపోడం విచిత్రంగా వుంది," అన్నాడు వాలి.

"ఈ దేశంలో మనం గుచ్చి గుచ్చి అడిగితేగాని ఎవ్వరూ ఏమీ చెప్పరు," అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"అది కారణం కాకపోవచ్చు!" అన్నాడు వాలి క్లుప్తంగా.

"వాళ్లను అడిగితే నిజం తెలుస్తుంది," అన్నాడు గిరి.

గిరి కారును పోనిచ్చాడు. వెనకనే జీప్ వస్తోంది — పోలీసు స్టేషన్ ముందు వందలాది ప్రజలు గుమిగూడి వున్నారు. ప్రజలు క్యూలో వెళ్లి సబిన్‌స్పెక్టర్ శవాన్ని చూసిపోతున్నారు.

ఇన్‌స్పెక్టర్ సుకుమార్ గదిలోకి నడిచాడు వాలి. శవం ఉన్నచోటుకు వెళ్ళాడు గిరి.

కానిస్టేబుల్సు గదిలో కొచ్చారు.

"మీరు చెక్ చేసిన ఫియట్ కారు ఎటు వెళ్తోంది ?" అడిగాడు వాలి.

"మద్రాసువైపు వెళ్తోంది సార్," అన్నాడు శివన్.

"మీకు రెండు లారీలు కనిపించాయా ?"

శివన్ ఎందుకో గిరిధర్‌వంక చూశాడు.

"మేం కారును చెక్ చేస్తుండగా రెండు లారీలు వెళ్ళడం గమనించాను, సార్."

"వాటి నెందు కాపలేదు ?''

''శివరామ్‌గారు ఆపమనలేదు, సార్."

"మీకు అంబాసిడర్ కారు కనిపించిందా ?"

"కనిపించింది సార్. అందులో ఆడవాళ్లు వున్నారు. డ్రయివర్ మాత్రం ముసలాడు. దాన్ని ఆపి, చెక్ చేయకుండా శివరామ్‌గారు పోనిచ్చారు."

వాళ్ళను వెళ్ళమన్నాడు వాలి. వాళ్లు వెళ్ళాక సుకుమార్‌వంక చూశాడు.

''సుకుమార్ ఖాయ్, వాళ్ళు పూర్తిగా నిజం చెప్పడంలేదు. అందుకు ఏదో కారణం ఉంటుంది. రహస్యంగా వాళ్లను గమనిస్తూ వుండాలి !" అన్నాడు వాలి.

"అలాగే చేస్తాను, సార్.''

చుట్టపొగ పీల్చి వదుల్తూ వాలి బయటనున్న కారువైపు నడిచాడు. అతడి వంక ప్రజలు విచిత్రంగా చూస్తూ నిలబడ్డారు.

* * *

6

పడక కుర్చీలో కూర్చుని వాలి దినపత్రికను చూస్తున్నాడు. ఇన్‌స్పెక్టర్ పీటర్ హత్య ! ఇప్పుడు సబిన్‌స్పెక్టర్ శివరామ్ హత్య ప్రొహిబిషన్ ఎవరి కోసం ? ఈ హెడ్ లైన్లతో మొదటి పేజీలో పెద్దవ్యాసం ముద్రించబడింది.

ఒక ప్రఖ్యాత రచయిత రాసిన వ్యాసమది ! ఎన్ని ఆడ్డంకులు పెట్టినా తాగేవాడు తాగడం మానడు. తమ స్వేచ్ఛకు అడ్డుపడే చట్టాలను ప్రజలు హర్షించరు. మద్యపాన నిషేధం మూలంగా బూట్‌లెగ్గర్స్ ఎక్కువమంది రూపొందారు. తక్కువకాలంలో ఎక్కువ డబ్బు సంపాదించడానికి లిక్కర్ స్మగ్లింగ్ అనేకమందికి బిజినెస్ అయింది.

అన్నిటికీ తెగించిన బూట్‌లెగ్గర్స్‌ను పట్టుకోడానికి ప్రయత్నించి, నీతి నిజాయితీ గల పోలీసు ఉద్యోగులు ప్రాణాలను బలి యిస్తున్నారు.

ప్రొహిబిషన్‌కి వ్యతిరేకంగా వాదిస్తూ నవలా రచయిత తన వ్యాసాన్ని వుద్రేకంతో ముగించాడు.

"ప్రజలకు ఉన్నవి లేకుండా చేయడం కాదు ప్రభుత్వ కర్తవ్యం! వారికి లేనివాటిని సమకూర్చాలి! ఈ విషయాన్ని ప్రభుత్వం గుర్తించాలి." హెచ్చరించాడు రచయిత.

టెలిఫోన్ మ్రోగింది. వాలి రిసీవర్ని అందుకున్నాడు.

"వాలి స్పీకింగ్," అన్నాడు.

"వాలిగారూ, కరుణాకరన్ హియర్. మీతో అర్జంటుగా మాట్లాడాలి," అన్నాడు చీఫ్ మినిస్టర్ అటువైపునుంచి.

"వెంటనే వస్తాను," అని వాలి రిసీవర్ని పెట్టేశాడు.

ఛీఫ్ మినిస్టర్ కరుణాకరన్‌కి ఎదురుగా వాలి కూర్చున్నాడు. పొడవాటి చుట్ట అతడి పళ్లమధ్య ఉంది. పొగ పీల్చి వదుల్తున్నాడు.

నవ్వుతూ అతడు చీఫ్ మినిస్టర్‌వైపు చూశాడు. పొట్టిగా, లావుగా ఉన్నా

దతను. తలమీద ఫెజ్ కాప్ ధరించాడు. పంచ, జుబ్బాలో వున్నాడతను. పట్టుదల మనిషి.

"వాలిగారూ, నెల్రకితం మీతో మాట్లాడి మీ సహకారాన్ని కోరాను. ఈ రాష్ట్రంలో ప్రొహిబిషన్ విజయవంతం కావాలని నా కోరిక. ఎందరో పోలీసు ఉద్యోగులు నిర్విరామంగా కృషి చేస్తున్నారు. కాని నేను అనుకున్న విధంగా ఫలితాలు రాలేదు. పట్నంలో అనేకచోట్ల మత్తుద్రవాలు అమ్ముతున్నారని నాకు వార్తలు వస్తున్నాయి. ఇదంతా చూస్తుంటే నాకు చాలా నిరుత్సాహంగా ఉంది. పోలీసు ఉద్యోగులు హత్య చేయబడ్డం ప్రొహిబిషన్ వ్యతిరేకులకు ఆయుధమై కూర్చుంది. మద్యపాన నిషేధాన్ని విమర్శిస్తూ వ్యాసాలు ప్రచురితమవుతున్నాయి. ఈ పరిస్థితుల్లో ఏం చెయ్యాలో తోచడంలేదు," అన్నాడు చీఫ్ మినిస్టర్.

"కరుణాకరన్ భాయ్! నువ్వు నా సహకారం కావాలన్నావని సరే అన్నాను. కాని ప్రొహిబిషన్ జయిస్తుందనే నమ్మకం నాకు లేదు. చట్టాల మూలంగా మనుషులలో వున్న అలవాట్లను మనం ఆపలేం. అమెరికాలో ప్రొహిబిషన్ పెట్టి చివరికి రద్దుచేయవలసి వచ్చింది. రష్యాలాటి కమ్యూనిస్టు దేశాల్లో ప్రొహిబిషన్ లేదు. ఇది ముట్టరాదని మనం గట్టిగా అంటే మనుషులు దాన్ని రహస్యంగా ముట్టుకోడానికి ప్రయత్నిస్తారు. మద్యపానం నిషేధించకుండా, మద్యం సేవించడంవలన వచ్చే నష్టాలను గురించి ప్రభుత్వం విశేషంగా ప్రచారం చేయడం శ్రేయస్కరం. అప్పుడు కొందరేనా మద్యాన్ని వదిలేస్తారు. బాహాటంగా మద్యం దొరక్కపోవడం వలన బూట్‌లెగ్గర్స్‌కు అవకాశం ఏర్పడింది. హెచ్చు ధరలకు అమ్మి వాళ్ళు బాగా డబ్బు చేసుకొంటున్నారు. మద్యపాన నిషేధం నిజం చెప్పాలంటే బూట్‌లెగ్గర్స్‌కు ఉపయోగపడ్తోంది," అన్నాడు వాలి.

కరుణాకరన్ వెంటనే జవాబివ్వలేదు. ఆలోచిస్తూ కళ్ళు మూసుకొన్నాడు.

"అయితే ప్రొహిబిషన్ రద్దు చేయమంటారా ?"

"అలా నేను చెప్పను. ప్రొహిబిషన్ విజయవంతం కాదని నా నమ్మకం. నేను ఆంధ్రదేశంలో యీ మధ్య తిరిగాను. అక్కడ ప్రొహిబిషన్ లేదు. కాని తప్పతాగి రోడ్లమీద పడి తిరిగేవాళ్లు నా కెక్కడా అగుపించలేదు," అన్నాడు వాలి.

"వాలిగారూ, తాగుడంటే నాకు చిన్నప్పటినుంచీ అసహ్యం. నా తండ్రి

తప్పతాగి వచ్చి అమ్మనీ, పిల్లల్నీ చావగొట్టేవాడు. తాగుడువలన నా తండ్రి అకాలంగా మరణించాడు. ఒక యువకుడు తప్పతాగి తన వదిన చెయ్యి పట్టుకున్నాడు. తాగుడు మైకంలో మనిషి చేసే అపచారాలకు హద్దులుండవు. చట్టాలతో నిర్బంధిస్తేగాని ఎవ్వరూ తాగడం మానరు. ప్రొహిబిషన్ మూలంగా అందరూ బాగుపడకపోయినా కొందరేనా బాగుపడొచ్చని నా అభిప్రాయం. గాంధీజీ దేశమంతటా ప్రొహిబిషన్ పెట్టాలన్నారు!"

వాలి గంభీరంగా నవ్వాడు.

"మనం వాదించడం దేనికి ? నన్నెందుకు రమ్మన్నావో చెప్పు," అన్నాడు వాలి.

"మీరొక మాస్టర్‌ప్లాను తయారుచేయండి. ఈ రాష్ట్రంలో ఎక్కడా మత్తు ద్రవాలు లేకుండా చేయాలి. బూట్‌లెగ్గర్స్‌ను నాశనం చెయ్యాలి. ఈ రాష్ట్రంలో ప్రొహిబిషన్ నిజంగా విజయవంతమవ్వాలి," అన్నాడు చీఫ్ మినిస్టర్.

"పక్క రాష్ట్రాలనుంచి స్మగుల్ చేసి ఇక్కడకు మత్తుద్రవాలను తెచ్చేవారిని పట్టుకోడానికి నేను ప్రయత్నిస్తాను. ఇది నేను ఒంటరిగా చెయ్యలేను. పోలీసు సహకారం నాకు కావాలి," అన్నాడు వాలి.

"వాలిగారూ, ఈ రాష్ట్రంలోని పోలీసులు మీతో పూర్తిగా సహకరిస్తారు. మీరు తొందరగా ఏదో చెయ్యాలి. ఇటుపైన హత్యలు లేకుండా మీరు చూడాలి. ఇద్దరు పోలీసు ఉద్యోగులు పోయేసరికి ప్రజల్లో దుమారం లేచింది. పత్రికలు ప్రభుత్వాన్ని ఏకేస్తున్నాయి."

"డోంట్ బాదర్, చెయ్యవలసింది చేస్తాను," అన్నాడు వాలి.

"వాలిగారూ, ఈ రాష్ట్రంలో ప్రతిచోటా బ్రాందీబుడ్లు అమ్ముతున్నారని రూమర్లు నా కందాయి. అవెంతవరకు నిజమో కనుక్కోండి. ఇటుపైన మనం తరచుగా కల్సుకొని అన్నివిధాలా కట్టుదిట్టంచేసే మార్గాలను వెతకాలి," అన్నాడు కరుణాకరన్.

ఆతడితో కరచాలనంచేసి వాలి బయటకు నడిచాడు.

* * *

7

పడక కుర్చీలో పడుకుని విశ్రాంతి తీసుకొంటున్న వాలి బూట్ల చప్పుడు విని కళ్ళు తెరిచాడు.

నవ్వు ముఖంతో గిరి గదిలో కొచ్చాడు. ఎదురుగాఉన్న సోఫాలో కూర్చున్నాడు.

"గోల్డెన్ లారీ సర్వీస్ గురించి వివరాలు సేకరించాను. ఆ కంపెనీ స్థాపించి ఇరవై ఏళ్లయింది. సంవత్సరం క్రితం ఆ కంపెనీ చేతులు మారింది. పి. అనూరాధ అనే ఆమె ఆ కంపెనీని కొంది. ప్రస్తుతం ఆ కంపెనీని ఆమె నడుపుతోంది," అన్నాడు గిరి.

"అనూరాధ ఎవరో తెలుసుకున్నావా ?"

"ఆమె భర్త మోహనరాజు కాశ్మీర్ దివాన్‌గా వుండేవాడు. ఆయన రిటైరయినాక బెంగుళూరులో స్థిరపడిపోయాడు. ఆయన మరణించాక భార్య అనూరాధ యీ లారీ కంపెనీని కొంది. ఆమె మోహనరాజు నాల్గో భార్య. ఆమె ధనవంతురాలని విన్నాను," అన్నాడు గిరి.

"మోహనరాజు నన్ను కలుసుకున్నాడు. కాశ్మీర్‌లో నా కతను ఘనస్వాగతం యిచ్చాడు," అన్నాడు వాలి.

"ఆ ఫియట్ కారు మద్రాసులో వున్న చెట్టియార్ అండ్ కంపెనీది. ఆ కారును వాళ్ళు శ్యామ్‌సుందర్ అనే అతడికి అద్దె కిచ్చారు. పట్నం చూడ్డానికి వచ్చినవాళ్లకు ఆ కంపెనీ కార్లు అద్దె కిస్తూ వుంటుంది."

"శ్యాంసుందర్ అడ్రెస్ తెల్సుకున్నావా ?"

"తెల్సుకోడంతో వూరుకోలేదు, సార్. అతడి యింటికి వెళ్లాను ఆ అడ్రెస్ వున్న యింట్లో అడ్వకేటు రామయ్యర్ నివసిస్తున్నాడు."

నోట్లోని చుట్టను వాలి చేత్తో పట్టుకున్నాడు. గిరివైపు సూటిగా చూశాడు.

"ఫియట్ కారును వాళ్ల చెట్టియార్ కంపెనీకి వాపసు చేశారా ?"

"వాపసు చేశారు. ఆ కారును ఎవరో అమెరికన్ అద్దెకు పట్టుకెళ్ళాడు," అన్నాడు గిరి.

"గిరీ! శ్యామ్‌సుందర్ కల్పితమైన పేరై వుండాలి. ఆ పేరు చెప్పి, ఏదో అడ్రెస్ యిచ్చి వాళ్ల కారును అద్దెకు తీసుకొన్నారు. పనవగానే కారును వాపసు చేసేశారు. మళ్ళీ కారును అద్దెకు తీసుకోడానికి వాళ్ళు ఆ కంపెనీకి రావొచ్చు. వాళ్ళు వస్తే వెంటనే మనకు ఫోన్ చెయ్యమని చెప్పావా ?" అన్నాడు వాలి.

"చెట్టియార్ అండ్ కంపెనీ మేనేజరు సలీమ్ హుంషారైన యువకుడు. శ్యామ్‌సుందర్ పేరుచెప్పినతను మళ్ళా వస్తే నాకు వెంటనే ఫోన్ చేస్తా-నన్నాడు."

"గిరీ, గుడ్‌వర్క్," అన్నాడు వాలి.

* * *



ఏర్‌కండిషన్డ్ హాల్లో ఇరవైమంది పోలీసు ఉన్నతోద్యోగులు కూర్చొని వున్నారు. వాలి కొకవైపున ఐ.జి. ఆఫ్ పోలీస్ అకిలన్ ఉన్నాడు. మరో పక్క గిరి కూర్చున్నాడు.

గదిలో చల్లగా వుంది. ఏర్‌కండిషనింగ్ మిషన్ లీలగా ధ్వనిస్తోంది. డిటెక్టివ్ వాలి చుట్టపొగ వదుల్తూ టేబుల్‌చుట్టూ కుర్చీల్లో కూర్చున్నవాళ్ళవైపు మందహాసంతో చూశాడు.

"మైడియర్ ఫ్రెండ్స్! ఈ రాష్ట్రంలో ప్రొహిబిషన్ విజయవంతం కావాలని మన ముఖ్యమంత్రి కోర్కె. ప్రొహిబిషన్ను అమలుపర్చడానికి కొన్ని వందలమంది పోలీసు ఉద్యోగులు నిర్విరామంగా కృషిచేస్తున్నారు. ఈ కృషి చాలదని అనేక నిదర్శనాలవలన మనకు వ్యక్తమవుతోంది," అని ఆగాడు వాలి.

ఆజానబాహుడైన వాలివైపు అందరూ చూస్తున్నారు.

"మద్రాస్‌పట్టణంలో ఎక్కడపడ్తే అక్కడ మత్తుద్రవాలు దొరుకుతున్నాయి. ప్రొహిబిషన్ లేనప్పుడు అవి వైన్‌షాపుల్లో దొరికేవి. ఇప్పుడు అనేకచోట్ల విస్కీ, బ్రాందీ రమ్ వగైరా లభిస్తున్నాయి. వాటి అమ్మకంలో డబ్బు వుండడంవలన నిరుద్యోగులు ఆ రంగంలో ప్రవేశించి రహస్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రొహిబిషన్ జయకరంకావాలంటే మత్తుద్రవాలు ఈ రాష్ట్రంలోకి రాకుండా మనం చూడాలి. ప్రస్తుతం ఆంధ్ర, కర్ణాటక, కేరళ రాష్ట్రాలనుంచి

యిక్కడకు మత్తుద్రవాలను స్మగుల్ చేయొచ్చు. పాండిచెరీ నుంచి కూడా యిక్కడకు సరఫరా చేయొచ్చు. ఆ ప్రాంతాలనుండి ఈ రాష్ట్రంలోకి వచ్చే బస్సులను, లారీలను, కార్లను ప్రొహిబిషన్ డిపార్టుమెంట్ పోలీసులు చెక్ చేస్తున్నారు. అలా చెక్‌చేసే పోలీస్ బలగాలను మనం యింకా బల పర్చాలి! సబిన్‌స్పెక్టర్ శివరామ్ హత్య గురించి మీకు తెలుసు. వాళ్ల తోవకు అడ్డొచ్చినవాళ్లను బూట్‌లెగ్గర్స్ నిర్మూలించడానికి ప్రయత్నిస్తారు. జీప్‌లో వెళ్లిన నల్గురు పోలీసు వుద్యోగులు ఈ బూట్‌లెగ్గర్స్‌ను ఆపలేదు. ట్రంక్ రోడ్లమీద తిరిగే పోలీసు వుద్యోగులకు మనం సరైన ఆయుధాలను సమకూర్చాలి ప్రతి జీప్‌వెనకా ఒక వాన్ వుండాలి. వాన్‌లో యాభైమంది సాయుధపోలీసు ఉండాలి. పాకెట్ మిషన్‌గన్స్‌ను వాళ్లకు మనం సర్దుబాటు చెయ్యాలి!"

"వాలిగారూ, ఏదో యుద్ధం వచ్చినట్లు మీరు చెప్తున్నారు," అన్నాడు ఐ. జి. అకిలన్.

"అకిలన్ భాయ్, మనం పోలీసుల బలాన్ని పెంచకపోతే మరికొందరు శివరామ్‌లు అన్యాయంగా బలైపోతారు," అన్నాడు వాలి.

"అది నిజమే," అన్నాడు కమిషనర్ ధర్మరాజు.

"అంత బలంగా మన పోలీసు దళాలు వుంటే బూట్‌లెగ్గర్స్ వాళ్లను ఓడించి పారిపోలేరు," అన్నాడు వాలి.

"యూ ఆర్ రైట్" అన్నాడు అకిలన్.

"రాష్ట్రవ్యాప్తంగా స్మగుల్డ్ మత్తుద్రవాలను అమ్ముతున్నారు. చిన్న పాన్ షాపుల్లో మద్యం దొరుకుతోంది. అటువంటి షాపులను మనం సీల్‌చేసి మూసివేయాలి. దానితో షాపువాళ్ళు భయభక్తులతో ప్రవర్తిస్తారు."

"గుడ్ ఐడియా," అన్నాడు కమిషనర్.

"ఇల్లిసిట్ డిస్టిలేషన్ అనేకచోట్ల సాగుతోంది. అటువంటి ప్రదేశాలను రెయిడ్‌చేసి ఫెర్‌మెంటెడ్ వాష్‌ని ధ్వంసం చెయ్యాలి."

"అది చేస్తున్నాం," అన్నాడు ఐ. జి.

"అదింకా ఎక్కువగా చెయ్యాలి. వారాని కొకసారి వెళ్తే లాభించదు," అన్నాడు వాలి.

కాస్సేపు హాల్లో నిశ్శబ్దంగా వుంది. యూనిఫాంలలో వున్న నౌకర్లు కూల్ డ్రింక్స్‌ను అందరకూ అందించారు. కూల్‌డ్రింక్ తాగి వాలి మళ్ళీ చెప్పుకు పోయాడు.

"లిక్కర్ స్మగ్లింగ్ ఎలా సాగుతుంది ? రైళ్లలో పట్రావచ్చు, లారీలు, బస్సుల్లో తేవచ్చు. విమానాల్లో పట్రావచ్చు ఇతర రాష్ట్రాలనుండి యిక్కడి కొచ్చే ప్రతి లారీనీ, బస్సునూ, కారునూ మనం సోదా చెయ్యాలి. విమానం లోంచి దిగిన పాసింజర్ల పెట్టెలను, ఏర్ బాగ్స్‌ను తెరిచి చూడాలి," అన్నాడు వాలి.

"వాలిగారూ, మీరు చెప్పినదంతా చెయ్యాలంటే ప్రస్తుతం రాష్ట్రంలో వున్న పోలీసులు చాలరు. నాలుగు రెట్లు వాళ్ల నంబరు పెరగాలి,'' అన్నాడు ఐ. జి.

"అవసరాన్నిబట్టి మనం ఎక్కువమందిని ఉపయోగించాలి. సి. ఆర్. పి వాళ్ళను మనం ఉపయోగించవచ్చు, కేంద్ర ప్రభుత్వం అనుమతితో," అన్నాడు వాలి.

"యస్సార్, అలా చేయొచ్చు," అన్నాడు కమిషనర్.

"ప్రస్తుతం ఏ యుద్ధమూ లేదు. మన సైనికులను కూడా ఇందుకోసం నియమించవచ్చు."

రెండుగంటల తర్వాత హోటల్ అశోక్‌లో జరిగిన సమావేశం ముగిసింది. వాలి హుషారుగా తన గదికి చేరుకొని పడకకుర్చీలో వెనక్కి వాలాడు.

"వాలిగారూ, ఇదంతా చేసినా ప్రొహిబిషన్ విజయవంతం అవుతుందని మీరు నమ్ముతున్నారా ?" అడిగాడు గిరి.

వాలి గంభీరంగా నవ్వాడు.

"గిరీ, చెరువుచుట్టూ సైనికులను నిలబెడితే ప్రజలు అటువైపు వెళ్లరు. కాని చెరువులోని నీళ్ళను సైనికులు తాగే అవకాశం వుంది !" అన్నాడు వాలి నవ్వుతూ.

* * *

8

ఏర్‌కండిషండ్ హాల్లో నాలుగు ఫ్లోరసెంట్ లైట్లు ప్రకాశవంతంగా వెలుగుతున్నాయి.

బుచ్చయ్య ఎదురుగా సోఫాల్లో నలుగురు మనుషులు కూర్చొని వున్నారు. అందరూ ఖరీదైన దుస్తుల్లో వున్నారు.

బుచ్చయ్య చప్పట్లు కొట్టాడు. ఇరవైఏళ్ళ యువతి వయ్యారంగా నడుస్తూ అతడి ముందుకొచ్చింది. అత డామెకేసి నవ్వుతూ చూశాడు.

"మిస్ లీనా, డ్రింక్స్ ఆర్ వెల్‌కమ్!'' అన్నాడతను.

లీనా ఒక స్కాచ్ విస్కీ బాటిల్ని తెరిచింది. ఐదుగ్లాసుల్లో విస్కీ పోసి, కూల్ సోడా కలిపింది. ఆమె పక్కగదిలోకి వెళ్ళిపోయింది.

"కామ్రేడ్స్, లెటస్ డ్రింక్ టు సక్సెస్!" అన్నాడు బుచ్చయ్య.

"టు సక్సెస్!" అన్నారందరూ, గ్లాసులను ఎత్తి.

గ్లాసులోని విస్కీని సగంపైన తాగేసి బుచ్చయ్య తన సహచరులవైపు చూశాడు.

''కామ్రేడ్స్, ఈ వారంలో మనం మత్తుద్రవాలను ఈ రాష్ట్రంలోకి స్మగుల్ చెయ్యలేకపోయాం. ప్రొహిబిషన్ డిపార్టుమెంటు పోలీసులు ట్రంక్ రోడ్లను కాస్తున్నారు. నలుగురైదుగురైతే మనం వాళ్ళతో పోట్లాడవచ్చు. వాళ్ల సంఖ్య అమితంగా పెరిగింది. జీప్ వెనకనే వాన్ కూడా వుంటోంది. వాళ్లను ఎదిరించడం మనకు సాధ్యంకాదు. మనం కొత్తపద్ధతుల్లో స్మగుల్ చేయాలి," అన్నాడతను.

"డిటెక్టివ్ వాలి మూలంగా యిదంతా సాగుతోందని విన్నాను. ఆయన్ని సఫా చేస్తే మన కి అడ్డంకులు వుండవేమో!" అన్నాడు జాన్.

బుచ్చయ్య కోపంగా జాన్‌వంక చూశాడు. జాన్ లోలోపల భయపడ్డాడు. బుచ్చయ్య దేవాంతకుడు. ఏ క్షణంలో ఏంచేస్తాడో ఎవ్వరూ ఊహించలేరు.

"మిస్టర్ జాన్! యీ పరిస్థితుల్లో ఏం చెయ్యాలో మీకు నేను చెప్తాను. నేను చెప్పేది వినడానికి మిమ్మల్ని పిల్చాను. నాకు సలహా లివ్వడానికి కాదు!" అరిచాడు బుచ్చయ్య.

"అయామ్ సారీ, బాస్," అన్నాడు జాన్ గాభరాగా.

"వాలి సాధారణ వ్యక్తికాదు. అతడితో మనం ప్రత్యక్షంగా పోట్లాడటం మంచిదికాదు. అతడు పగబట్టి మనమీదకు దాడిచేస్తే మన సంస్థ నామ రూపాలు లేకుండా పోతుంది. ఏదేనా పెద్ద అడ్డంకు మనకు ఎదురైతే దానికి దూరంగా పోయి గమ్యం చేరుకోడం అన్నివిధాలా మంచిది."

"అదే మంచిపద్ధతి, బాస్," అన్నాడు మీనన్.

"పులికి దూరంగా వుండడం మంచిది," అన్నాడు మస్తాన్.

"గాలి కెదురువెళ్ళడంకంటే దాని మార్గంలో పోవడం సులువైన పని," అన్నాడు కామత్.

"షటప్ అండ్ హియర్ మి!" గద్దించాడు బుచ్చయ్య.

గ్లాసుల్లో జాన్ విస్కీ పోశాడు. మస్తాన్ సోడా కలిపాడు. నిషాతో నిండిన కళ్లతో బుచ్చయ్య వాళ్లవంక చూశాడు. అతని కళ్ళు ఎఱ్ఱగా వున్నాయి. మశూచికం మచ్చలు, పెద్ద కనుబొమ్మలు అతడి ముఖానికి వికృత రూపాన్ని చేకూర్చాయి.

"ఈ పట్నంలో అనేకచోట్ల రహస్యంగా బ్రాందీ, విస్కీ, రమ్ వగైరా అమ్ముతున్నారు. ఒకోసారి మఫ్టీ పోలీసులు కస్టమర్స్‌లా నటిస్తూ బుడ్డీలు కావాలని చివరికి మనవాళ్లను పట్టుకుంటున్నారు. ఇన్‌స్పెక్టర్ పీటర్ యిలాగే చేశాడు ఈ అవకాశం పోలీసులకు లేకుండా వుండేందుకు మన కస్టమర్స్‌కు ఒక రాగి వుంగరం యిస్తాం. ఇటుపైన ఆ వుంగరం వేలుకు వున్నవాళ్లకే డ్రింక్స్ సప్లయి చేయబడ్తాయి."

బుచ్చయ్య ఆగాడు. ఒక వుంగరాన్ని తీసి వాళ్ళకిచ్చాడు వుంగరంమీద పులిముఖం చెక్కబడింది.

"అనేక సైజుల్లో యీ వుంగరాలు తయారు చేయించాను. ప్రతి కస్టమరూ తనకు సరిపడే వుంగరాన్ని తీసుకోవచ్చు," అన్నాడు బుచ్చయ్య.

"ఈ పద్ధతి బాగుంది," అన్నాడు జాన్.

"వుంగరం లేకుండా ఎవరేనా కొత్తవాళ్ళు బుడ్డీ అడిగితే అటువంటి వ్యాపారం చేయడంలేదని మనవాళ్ళు జవాబిస్తారు."

"ఫైన్!" అన్నాడు మస్తాన్.

"ఇప్పుడు స్మగ్లింగ్ గురించి చెప్తాను. ఇటుపైన లారీల్లో మన సరుకు పట్టాలేం. గోల్డెన్ లారీ సర్వీస్‌లను చాలా జాగ్రత్తగా చెక్ చేస్తున్నారు. రైళ్ళలోకూడా చెక్కింగ్ ఎక్కువగా వుంది. ఇవాళ కారులో వెళ్తుంటే రోడ్డు వారగా గుడారాలు కట్టుకొని గుంపులుగా వున్న దేశదిమ్మర్లు నాకు కనిపించారు. కారు ఆపి వాళ్ళనే చూస్తూ కూర్చున్నాను. కొన్నిరోజు లిక్కడవుండి, పాత్రలూ పక్కలూ మూటగట్టుకొని వాళ్ళు మరో చోటకు పోతూ వుంటారు. వాళ్ళు పక్షుల్లా, జంతువుల్లా స్వేచ్ఛగా జీవిస్తూవుంటారు. ఇలాటి గుంపులు ఎన్నో వున్నాయి. వాళ్ళు యిటుపైన మన బుడ్డీలను స్మగ్లింగ్ చేస్తారు. చెక్‌పోస్టు నుంచి ముందువాళ్ళు వెళ్ళరు. రోడ్డమ్మట వాళ్ళు పోతుంటే ఎవ్వరూ వాళ్ళను అనుమానించరు. వాళ్లు సహజంగా మోసుకెళ్ళే మూటల్లో మనం ఎన్నో బాటిల్సు పెట్టొచ్చు?"

"బ్రిలియంట్ ఐడియా!" అన్నాడు కామత్.

"మరో విధానం. పుస్తకాలను గోనిపార్సిల్సులో మూడు నాలుగు కంపెనీల పేర మనం యిక్కడకు తెప్పిస్తాం. పైనా, క్రిందా, ప్రక్కల్నా పుస్తకాలు పెట్టి లోపల బుడ్డీలు అమర్చి గోనితో పాక్‌చేసి కుట్టేస్తారు. గోల్డెన్ లారీ సర్వీసు ద్వారా కాకుండా తదితర కంపెనీల లారీల్లో ఆ గోని పార్సిల్సు యిక్కడికి లక్షణంగా చేర్తాయి. మార్కెట్‌లో వేస్టుపేపర్ విలువకు దొరికే పాతపుస్తకాలను మనం యీ పనికి వుపయోగించవచ్చు," అన్నాడు బుచ్చయ్య.

"బాస్! యూ ఆరే జీనియస్" అన్నాడు మస్తాన్.

"ఇలా కొత్త కొత్త పద్ధతుల్లో మనం మత్తు ద్రవాలను స్మగుల్ చేసి యిక్కడివాళ్లకు ఏ లోటూ లేకుండా చూడాలి. కామ్రేడ్స్, మనం చేసేది ఒక విధంగా వ్యాపారం. మరో వైపునుంచి చూస్తే ప్రజాసేవ! ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాలు ప్రజలకు స్వేచ్ఛలేకుండా చేస్తున్నాయి. తినడం, తాగడం మనిషి జన్మహక్కులు. ఈ హక్కుల్ని ఏ ప్రభుత్వమూ రద్దుచేయలేదు. రద్దుచేయడానికి ప్రయత్నిస్తే మనలాటివాళ్ళు రంగంలో ప్రవేశిస్తారు," అన్నాడు బుచ్చయ్య.

"వెల్‌సెడ్ బాస్" అన్నాడు జాన్.

"తాగుడు మైకంలో చెడుగా ప్రవర్తించేవాళ్ళను శిక్షిస్తే నేను అభ్యంతరం చెప్పను. కాని యింట్లో కూర్చొని తాగేవాళ్ళకుకూడా అడ్డంకులు సృష్టించడం న్యాయసమ్మతంకాదు కామ్రేడ్స్, ప్రభుత్వం ప్రజలకు లేకుండా చేసిన

స్వేచ్ఛను పునరుద్ధరించడానికి మనం పాటుపడ్తున్నామన్న విషయం గుర్తుంచుకోండి. ఇలా కొంతకాలం సాగితే ప్రభుత్వం కళ్ళు తెరుస్తుంది. మనుషుల స్వేచ్ఛను అడ్డగించే పిచ్చి చట్టాలను ప్రవేశపెట్టారు!" అన్నాడు బుచ్చయ్య వుద్రేకంతో.

* * *

9

శరత్ బస్సులోంచి దిగాడు. పేవ్‌మెంటమ్మట మెల్లిగా అడుగు లేస్తున్నాడు. నలువైపులా లైట్లు వెల్గుతున్నాయి.

ఒకా పాన్ షాపు ముందు శరత్ ఆగాడు. చెయ్యిని పైకిఎత్తాడు. పులి ముఖం వున్న రాగి వుంగరం వంక షాపతను చూశాడు.

"మెక్‌డోవల్, అరబాటిల్," అన్నాడు శరత్.

అట్టపెట్టెను షాపతను శరత్ కిచ్చాడు. అతడు అరవై రూపాయలు చెల్లించాడు. అట్టపెట్టెను ప్లాస్టిక్ బాగ్‌లో పెట్టుకొని శరత్ గబగబా నడవసాగాడు.

వెనకనే వస్తున్న మనిషిని శరత్ చూడలేదు. అతడు రోడ్డు దాటబోతుండగా వెనకనుంచి ఎవరో అతని చెయ్యిని పట్టుకున్నారు.

శరత్ వెనక్కి తిరిగి చూశాడు. వులిక్కిపడ్డాడు. పొడగాటి మనిషి! బుర్ర మీసాలు! నోట్లో చుట్ట వెల్గుతోంది. అతడు ఫుల్ సూటుతో వున్నాడు.

"ఏం కావాలి సార్?" అన్నాడు శరత్ గాభరాగా.

"నీ బాగ్‌లోని అట్టపెట్టె!" అన్నాడు వాలి.

"నా బాగ్‌లో ఏ అట్టపెట్టీ లేదు," అన్నాడు శరత్.

"సరిగ్గా చూస్తే కనిపిస్తుంది!"

శరత్ చెయ్యి విడిలించుకోడానికి ప్రయత్నించాడు. సాధ్యం కాదని గ్రహించాడు. తనని పట్టుకున్న చెయ్యి స్టీల్ చెయ్యిలా వుంది!

బాగ్‌లోని అట్టపెట్టెను తీసి అతడు వాలి కిచ్చాడు. పెట్టెను తెరిచి లోపలున్న బ్రాందీ బాటిల్‌ను చూశాడు వాలి. అతడి చూపు శరత్‌వైపు మళ్ళింది.

శరత్ యువకుడు. అతడి వయస్సు 22 వుంటుంది.

"ఇది నీకేనా?" ప్రశ్నించాడు వాలి.

"కాదు సార్."

"ఎవరికి?"

"మా నాన్నగారికి."

"నీతో వచ్చి యింట్లో అడుగుతాను. నిజం చెప్పడం మంచిది," అన్నాడు వాలి.

"నాతో వస్తే రండి. నేను చెప్పింది నిజమే."

"ఈ రాష్ట్రంలో ప్రొహిబిషన్ అమల్లోవుంది. ఈ బాటిల్ నీ దగ్గరుంటే నీకు శిక్ష పడుతుంది."

శరత్ సూటిగా వాలివంక చూశాడు.

"నాన్నగారి వయస్సు యాభై దాటింది. చాలాకాలంనుంచి తాగడం ఆయనకు అలవాటు. ఆయన పెర్మిట్ యింతవరకూ రిన్యూ కాలేదు. ఎసెసెల్సీ పుస్తకంలో రాసిన వయస్సు పత్రం కావాలని అధికారులు అంటున్నారు. నాన్నగారు రిటైరయ్యే స్థితిలో వున్నారు. ఆయన ఎసెసెల్సీ బుక్కు ఎంత వెతికినా కనపడలేదు. ఆ స్థితిలో మరేం గత్యంతరంలేక నాన్నగారు ఎక్కువ ధరిచ్చి యిలా కొనుక్కొని తాగవలసి వస్తోంది. తండ్రి కోరికను తీర్చడం కొడుకు ధర్మం. ఆ పని చేయడంలో ప్రభుత్వం నన్ను శిక్షిస్తే శిక్ష విధించమంటాను," అన్నాడు శరత్.

క్షణకాలం వాలి మాట్లాడలేదు. పొగ వదుల్తూ నవ్వుతూ ఎదురుగా వున్న యువకుడివైపు చూశాడు. అతడి భుజంమీద తట్టాడు. అట్టపెట్టి అతడి కిచ్చేశాడు.

"అబ్బాయ్, వెళ్ళిరా!" అన్నాడు వాలి.

శరత్ రోడ్డుదాటి వెళ్ళిపోయాడు. వాలి వెనక్కితిరిగి వేగంగా నడిచాడు. రోడ్డువారగా వున్న పోలీసు జీప్‌లో ఎక్కాడు. జీప్ కదిలింది.

పాన్ షాపు ముందు జీప్ ఆగింది. వాలి షాపు ముందుకెళ్ళాడు.

"మెక్‌డోవల్, అరబాటిల్!" అన్నాడు వాలి.

షాపు యజమాని అతనివంక ఆశ్చర్యంగా చూశాడు.

"ఇది పాన్ షాపు, సార్, సారాకొట్టు కాదు," అన్నాడు.

"ఇప్పుడే ఒకతనికి అమ్మావు!"

"అది హెయిరాయిల్ సార్," అన్నాడతను.

వాలి సౌంజ్ఞ చేశాడు. ఇన్‌స్పెక్టర్ రంగన్, ముగ్గురు కానిస్టేబుల్సు షాపు ముందు కొచ్చారు.

షాపు సోదా చేశారు. కూల్‌బాక్స్ అని పేరు చెక్కివున్న పెట్టెలో ఐస్ లేదు. పది బ్రాందీ బుడ్డీలు వున్నాయి.

పోలీసులు షాపును మూసి తాళం వేశారు. షాపు యజమాన్ని జీప్ వెనక సీటుమీద కూర్చోబెట్టారు జీప్ కదిలింది.

* * *

పోలీసు లాకప్‌లో వున్న అతని ఎదురుగా వాలి నిలబడ్డాడు.

"నీ పేరు?" ప్రశ్నించాడు వాలి.

"పద్మరాజు సార్."

"ఈ బుడ్డీలమ్మితే నీ కెంత వస్తుంది?"

"బుడ్డీకి అయిదు రూపాయలు వస్తుంది సార్."

"రోజూ ఎన్ని అమ్ముతున్నావు ?"

"పది బుడ్డీలు కదుల్తాయి సార్."

"నువ్వీ పని చట్టానికి వ్యతిరేకంగా చేస్తున్నావని నీకు తెలుసా?"

"తెలుసు సార్. నాది పెద్ద సంసారం సార్. ఇందులో ఎక్కువ డబ్బొస్తుంది. అందుకని తెగించి దిగాను."

"నీకు ఆ బుడ్డీలు ఎవరిస్తారు ?"

"శివయ్య యిస్తాడండీ."

"శివయ్య ఎక్కడుంటాడు?"

"అది నాకు తెలియదు సార్. అతడు షాపుకొచ్చి సరకు యిచ్చిపోతాడు."

"నువ్వు వెంటనే డబ్బు చెల్లించాలా?"

"బుడ్డీకి అయిదు రూపాయలు తగ్గించుకొని డబ్బివ్వాలి సార్."

"అరబాటిల్ ఎంత కమ్ముతావు?"

"అరవై రూపాయలకు."

"ఒక్కోసారి యింకా ఎక్కువ వస్తుందేమో!"

"ఎప్పుడేనా వస్తుంది సార్. ఈ ధరే ఎక్కువని అంటున్నారు," అన్నాడతను.

వాలి ఆలోచిస్తూ గదిలో పచార్లు చేశాడు.

"నన్ను ఏంచేస్తారు, సార్?"

"పోలీసులు నీ మీద కేసు పెడ్తారు. నువ్వు జైలుకి వెళ్తావు. నీ కుటుంబానికి దూరమవుతావు!" అన్నాడు వాలి.

"సార్, మీ కాళ్ళట్టుకుంటాను. నన్ను వదిలిపెట్టండి," అన్నాడతను.

వాలి మౌనంగా వుండిపోయాడు.

"ఇటుపైన యీ మందు వ్యాపారం చెయ్యను, సార్."

వాలి అతడివైపు సూటిగా చూశాడు.

"మాతో సహకరిస్తే నిన్ను వదిలేస్తాం!"

"ఏం చెయ్యాలో చెప్పండి సార్."

"శివయ్య మాకు కావాలి. అతడు మునుపటిలా నీ షాపు కొస్తాడుగా?"

"వస్తాడు, సార్."

"నిన్ను వదిలేస్తా. ఎప్పటిలా నీ వ్యాపారం చేసుకో! నీ షాపు ప్రాంతంలో మా మనిషి వుంటాడు. శివయ్య వచ్చినప్పుడు మా మనిషికి సౌంజ్ఞ చేయి. శివయ్యను మా మనిషి పట్టుకుంటాడు," అన్నాడు వాలి.

"వాడు రౌడీ సార్. నే నతనిని పట్టిస్తే అటుపైన నా మీద పగ సాధిస్తాడు."

"పగ సాధించడానికి అతడు బయట వుండడు, లాకప్‌లో వుంటాడు. నీకు ప్రమాదం రాకుండా పోలీసులు చూస్తారు."

"అలాగే చేస్తాను సార్," అన్నాడు పద్మరాజు.

గదిలోంచి వాలి బయటకొచ్చాడు. గబగబా ఇన్‌స్పెక్టర్ రంగన్ గదిలోకి నడిచాడు.

"రంగన్ భాయ్, అతడిని వెంటనే వదిలేయండి!'' అన్నాడు వాలి.

"సరకు అతడి షాపులో దొరికింది సార్. అతడిమీద కేసు పెట్టాలి," అన్నాడు రంగన్.

"మనకు కావలసింది యీ చిన్న చేపలు కాదు. ఇతడి వెనకనున్న పెద్ద చేపలు!" అన్నాడు వాలి.

"వెంటనే వదిలేస్తాను, సార్," అన్నాడు ఇన్‌స్పెక్టర్ రంగన్.

* * *

10

ఆంధ్రా సరిహద్దు దాటి లారీ వేగంగా ట్రంక్ రోడ్డమ్మట దూసుకుపోతోంది. సుమిత్రా రోడ్‌వేస్ అని లారీమీద పెద్ద అక్షరాల్లో రాసివుంది.

లారీ డ్రయివర్ స్పీడు తగ్గించాడు. పోలీస్ జీప్, వాన్ అతడికి కనిపించాయి. లారీ ముందుసీటుమీద యిద్దరు మాత్రం వున్నారు డ్రయివర్ లారీని ఆపి కిందకు దిగాడు.

సబిన్‌స్పెక్టర్ సెల్వరాజు లారీ పక్కకు వచ్చాడు. అరడజనుమంది సాయుధ పోలీసులు అతని పక్కనే వున్నారు.

"చెకిట్!" అన్నాడు సబిన్‌స్పెక్టర్.

కానిస్టేబుల్సు లారీలోకి ఎక్కారు. ఎన్నో గోని పాకెట్లను తిప్పి చూశారు.



పుస్తకాల పార్సిల్సు! మద్రాసులో వున్న బుక్ కంపెనీ అడ్రెస్ ఎర్రసిరాతో గోనిమీద పెద్ద అక్షరాల్లో రాసివుంది.

కానిస్టేబుల్సు కిందకు దిగారు.

"లారీనిండా పుస్తకాల పాకెట్లు వున్నాయి సార్." అన్నాడొక కానిస్టేబులు.

"తెరిచి చూశారా?" అడిగాడు సబిన్‌స్పెక్టర్.

"ఒక పార్సిల్‌కి చిల్లు పడింది సార్. లోపలున్న పుస్తకం కనిపిస్తోంది," అన్నాడు కానిస్టేబుల్.

వెళ్ళొచ్చని సబిన్‌స్పెక్టర్ సెల్వరాజు డ్రయివర్‌కి చెప్పాడు. లారీ రోడ్డు మ్మట వేగంగా వెళ్ళిపోయింది.

* * *

చీకటి పడింది. రోడ్డు లైట్లు వెల్గుతున్నాయి. పద్మరాజు షాపు ప్రాంతంలో గిరి పడిగాపులు కాస్తున్నాడు.

తను ఎదురుచూస్తున్న శివయ్య రాలేదు!

పోలీసులు రెయిడ్ చేసిన యీ షాపుకు శివయ్య రాడేమో అనిపించిందతనికి.

అతడు పేవ్‌మెంట్‌మీద నిలబడి సిగరెట్ వెలిగించాడు. పొగ వదుల్తూ నలువైపులా చూశాడు. మల్లిపూల దండల్ని ఒక యువతి చకచకా అమ్మేస్తోంది. ఇళ్ళకుపోయే గుమస్తాలు ఒక మూర కొనుక్కొని వెళ్ళిపోతున్నారు.

షాపు ముందు స్కూటర్ ఆగింది. పొట్టిగా, లావుగా వున్నతను షాపు

ముందుకెళ్ళాడు. అతడొక బాగ్‌ను షాపతనికిచ్చాడు. షాపతను యిచ్చిన కవర్ను జేబులో పెట్టుకున్నాడు.

పద్మరాజు సౌంజ్ఞలను గిరి గుర్తించాడు. వేగంగా తన కారు దగ్గరకు కదిలాడు.

రోడ్డమ్మట శివయ్య స్కూటర్ దూసుకుపోయింది. దాని వెనకనే గిరి కారును పోనిచ్చాడు. శివయ్య ఎక్కడికెళ్తాడో తను తెల్సుకోవాలి!

మరో నాలుగు షాపులకు శివయ్య బాగ్‌లను యిచ్చి, కవర్లను తీసుకున్నాడు.

శివయ్య దగ్గర యింక బాగ్స్ లేవని గిరి కనిపెట్టాడు. అతడి జేబులో వున్న కవర్లను శివయ్య ఎవరికిస్తాడు?

శివయ్య స్కూటర్ వెళ్తోంది. కొంచెం దూరంలో గిరి దాన్ని వెంటాడుతున్నాడు.

ఒక రెస్టారెంటు ముందు శివయ్య స్కూటర్ని ఆపి దిగాడు. ఓసారి నలువైపులా చూసి అతడు లోపలకు వెళ్ళాడు.

రెస్టారెంట్ ముందు కారాపి గిరి దిగాడు. ఏదో కారొచ్చి వెనకనే ఆగింది. అందులోంచి ఒక యువతి దిగింది. డ్రయివర్ కారు పక్కనే నిలబడ్డాడు.

ఆమెకేసి ఓరగాచూస్తూ గిరి సిగరెట్ వెలిగించాడు. ఆమె సన్నగా, పొడుగ్గా వుంది. ఎర్రటి చీర, అదేరంగు జాకెట్. చీరను బొడ్డుకిందకు కట్టుకుంది. ఆమె శరీరం బంగారంలా మెరుస్తోంది. ఆమె విశాలమైన కళ్ళలో జ్యోతులు ప్రకాశిస్తున్నాయి.

ఎర్రటి హేండ్‌బాగ్‌తో ఆమె రెస్టారెంటులోకి దూకింది. బయటినుంచి గిరి లోపలకు చూశాడు. శివయ్య ఎక్కడా కనబడలేదు!

తను వెంటాడుతున్నట్లు గ్రహించి శివయ్య పలాయనం చిత్తగించాడా? స్కూటర్ని వదిలి అతడు ఎందుకు పోతాడు?

గిరి రెస్టారెంటులోకి వెళ్లాడు. ఒక కుర్చీలో కూర్చున్నాడు. బేరర్ రాగానే వేడి టీ తెమ్మన్నాడు

అతడి కెదురుగా కాబిన్స్ వున్నాయి. శివయ్య ఆ కాబిన్‌లోకి వెళ్ళుండాలి! వేడి టీ వచ్చింది. టీ తాగి అతడు సిగరెట్ పీలుస్తూ కూర్చున్నాడు.

కాబిన్ స్ప్రింగ్‌డోర్ తెరుచుకొని శివయ్య బయటకు వచ్చాడు. అతడు తొందరగా రోడ్డువైపు నడిచాడు. బిల్లు చెల్లించి గిరి తన కారువైపు అడుగు లేశాడు.

కాబిన్‌లోంచి బయటకొచ్చిన యువతి గిరివంక విచిత్రంగా చూసింది. రెస్టారెంట్ మూలగా వున్న ఫోన్‌వైపు ఆమె కదిలింది

శివయ్య స్కూటర్‌మీద వెళ్తున్నాడు. గిరి కారులో అతడిని వెంబడిస్తున్నాడు. జనసంచారం ఎక్కువగా లేని వీధమ్మట స్కూటర్ వెళ్తోంది.

గిరి కారును పోనిస్తున్నాడు. వెనకనే ఏదో కారొస్తోందని అతడు గుర్తించాడు. తనని మరెవరో వెంటాడ్డం అసంభవం. ఆ కారు యిప్పుడే కనిపించింది.

గిరి తన చూపును ముందు వెళ్తున్న శివయ్యమీద కేంద్రీకరించి కారును పోనిస్తున్నాడు.

అమాంతం చెవులు పగిలేంత ధ్వని బాంబు పేలినట్లు వినిపించింది. గిరి స్టీరింగ్ వీల్‌ని బలంగా పట్టుకున్నాడు. ఏదో చప్పుడు అతడికి వినిపిస్తోంది. గిరి తన కారును ఆపాడు. పక్కనుంచి వెనుక కారు శరవేగంగా దూసుకుపోయింది. కారు నంబరు అతడికి కనిపించలేదు.

గిరి కిందకు దిగాడు. దూసుకుపోతున్న కారు వెనుక లైట్లు అతడికి కనిపిస్తున్నాయి. ఆ కారు వైపు షూట్ చేయడం వ్యర్థమని అతడు గ్రహించాడు.

తనకారు వెనక టైర్ వైపు చూశాడు. బరస్టయి వుంది! వెనక కార్లో వాళ్ళు తన కారు టైర్ని షూట్ చేశారు!

ఆలోచిస్తూ గిరి క్షణకాలం కారు పక్కనే నిలబడ్డాడు. తను వెంటాడు తున్నట్లు శివయ్య గ్రహించి రెస్టారెంటులోంచి ఎవరికో ఫోన్‌చేసి వుంటాడు. తన కారు టైర్ని షూట్‌చేసి శివయ్య పారిపోయేందుకు వాళ్ళు సహాయపడ్డారు!

టైర్‌ను గిరి తొందరగా మార్చాడు. కారును పోనిచ్చి, టెలిఫోన్ బూత్ ముందు ఆపి దిగాడు. లోపలకు వెళ్ళి, రిసీవరెత్తి వాలి నంబరు తిప్పాడు.

హోటల్ అశోక్ టెలిఫోన్ ఆపరేటర్ కంఠం వినబడింది.

"మిస్ రేఖ, వాలిగారి గదికి కనెక్షన్ ఇయ్యి," అన్నాడతను.

వెంటనే కనెక్షన్ యివ్వబడింది. వాలి కంఠం అటువైపునుంచి వినబడింది.

"గిరిని సార్. నా ప్రయత్నం ఫలించలేదు," అన్నాడు గిరి.

జరిగినదంతా వివరంగా వాలికి చెప్పాడు.

"వెనక కార్లో వాళ్ళను నేను అనుమానించలేదు. అందుమూలంగా వాళ్ల యింతారు," అన్నాడతను నిరుత్సాహంగా.

"గిరీ, వెంటనే పద్మరాజు షాపుకు వెళ్ళు! శివయ్య పారిపోగల్గాడు. పద్మరాజుకి ప్రమాదం రావచ్చు! నువ్వు జట్ స్పీడులో అక్కడి కెళ్ళాలి. అతడికి ప్రమాదం వాటిల్లకుండా చూడాలి," అన్నాడు వాలి.

"వెంటనే వెళ్తాను," అన్నాడతను.

రిసీవర్ పెట్టేసి అతడు బూత్‌లోంచి బయటకు వచ్చాడు. కారులో కూర్చుని తలుపు మూశాడు. తన వాచీవైపు చూశాడు. టైమ్ ఎనిమిదిన్నర అయింది. కారును వేగంగా పద్మరాజు పాన్‌షాపువైపు పోనిచ్చాడు.

లైట్ సిగ్నల్స్ మూలంగా అతడు కొన్నిచోట్ల చాలాసేపు ఆగవలసి వచ్చింది. అత డా షాపు ముందుకు చేరుకొనేసరికి తొమ్మిది కావస్తోంది.

షాపులో ఫ్లోరసెంట్ లైటు వెల్గటం చూసి గిరి సంతోషించాడు. పద్మరాజుకు ఏ ప్రమాదమూ రాలేదు!

కారులోంచి దిగి అతడు షాపు ముందుకు వెళ్ళాడు.

షాపు లోపల పద్మరాజు లేడు. మరో వ్యక్తి కూర్చుని వున్నాడు.

"పద్మరాజు ఎక్కడ?" అని అడిగాడు గిరి.

"ఆతడు పనిమీద వెళ్ళాడు, సార్." షాపులో వున్నతను జవాబిచ్చాడు.

"ఒంటరిగా వెళ్ళాడా ?"

"అతడి ఫ్రెండ్‌తో వెళ్ళాడు."

"ఎవరా ఫ్రెండ్ ?"

"శివయ్యతో వెళ్ళాడు సార్. వచ్చేస్తాడు!"

అతడి జవాబు విని గిరి వులిక్కిపడ్డాడు.

శివయ్య తొందరగా షాపుకి తిరిగొచ్చాడు. పద్మరాజును తనతో తీసుకెళ్ళాడు!

బల్లినోట్లో యిరుక్కున్న పురుగులా శివయ్య చేతుల్లో పద్మరాజు యిరుక్కుపోయాడు. గిరి మెదడులో విమానాలు దూసుకుపోతున్నాయి.

అతడు వేగంగా పరుగెత్తాడు. సమీపంలో వున్న బట్టల షాపులోకి దూరాడు. రిసీవరెత్తి వాలి నంబరు తిప్పాడు.

వాలి కంఠం అటువైపునుంచి వినపడింది. కాని అతడు నోరు తెరవలేకపోయాడు.

"గిరీ, పద్మరాజు ప్రమాదంలో వున్నాడా ?" అడిగాడు వాలి.

"వాలిగారూ, నేనిక్కడకి చేరుకునే లోపల శివయ్య వచ్చి పద్మరాజును తనతో తీసుకుపోయాడు," అన్నాడతను.

"గిరీ, పద్మరాజు మనతో సహకరించాడు. నాకు దూరాలోచన లేకుండాపోయింది! పద్మరాజును బలిచ్చేశాను, గిరీ!" అర్చాడు వాలి.

"వాలిగారూ, తప్పు నాది, మీదికాదు!"

"తప్పెవరిదైనా, పద్మరాజును ప్రస్తుతం మనం కాపాడలేం. శివయ్య అతడిని ఎక్కడకు తీసుకెళ్ళాడో శివుడికి తెలియాలి," అన్నాడు వాలి.

క్షణకాలం గిరి అలాగే నిలబడ్డాడు.

"గిరీ! అతడి స్కూటర్ నంబర్ చూశావా?"

స్కూటర్ నంబర్ని చెప్పాడు గిరి.

"వైర్లెస్ ద్వారా అన్ని పెట్రోలు వాన్స్‌కి వార్త పంపమంటాను. పద్మరాజుకి ఆయుర్దాయం వుంటే ఎక్కడో శివయ్య స్కూటర్ పోలీసులకు దొరుకుతుంది," అన్నాడు వాలి.

"ఏదో తొందరగా చెయ్యండి! సేవ్ హిమ్!" అని గిరి రిసీవర్ని పెట్టేశాడు.

షాపు ప్రాంతంలో పచార్లు చేస్తూ వుండిపోయాడు గిరి. నిమిషాలు దొర్లి పోతున్నాయి. టైమ్ పది దాటింది. తనింకా యిక్కడ ఎంతసేపు వుండాలో!

రోడ్డు వారగా ఆగిన యక్స్ వై జెడ్ కారు దగ్గరకు అతను పరుగెత్తాడు. వాలి అతడి వైపు సీరియస్‌గా చూశాడు.

"గిరీ ఇక్కడ కాపలా అనవసరం. పద్మరాజు శవం పోలీసులకు దొరికింది. అక్కడకు వెళ్తూ యిలా వచ్చాను. నీ కార్లో నా వెనకనే రా," అన్నాడు వాలి.

యక్స్ వై జెడ్ కారు వెనకనే గిరి తన కారును పోనిచ్చాడు.

* * *

11

కూమ్ నది పక్క రోడ్డమ్మట కారును పోనిచ్చి జీప్ వెనకనే ఆపి దిగాడు.

ఇన్‌స్పెక్టర్ కేశవన్ గబగబా వచ్చి వాలికి నమస్కరించాడు. వాలి నలు వైపులా చూశాడు. ఒక వైపున కూమ్ నది, రెండో వైపున ఎత్తయిన ప్రహరీగోడ!

పోలీసులు ప్రజలను దూరంగా పొమ్మని హెచ్చరిస్తున్నారు. ఇన్‌స్పెక్టర్ కేశవన్‌తో వాలి ప్రహరీగోడ వరకు నడిచాడు. వెనకనుంచి గిరి పరుగెత్తు కొచ్చాడు.

గోడ వారగా పెట్రోమాక్స్ లైట్ వెల్గుతోంది. ఆ కాంతిలో కనిపించిన దృశ్యం ఎంత ఘోరంగా వుందో వర్ణించలేం!

గిరి గాభరాగా వాలి వెనక్కి జరిగాడు. నేలమీద పద్మరాజు అవయవాలు చిందరవందరగా పడున్నాయి.

తల ఒకచోట పడుంది. రెండు కాళ్ళూ వేర్వేరుగా నేలమీదున్నాయి. చేతులు క్రూరంగా ఖండించబడ్డాయి. చిన్న పేగులు మెలికలు తిరిగిన పాములా బయట కొచ్చాయి. అతడి కడుపు, ఛాతీనిండా పోట్లు.

అతడు ధరించిన లుంగీ నేలమీద పడుంది. దాన్ని తీసి చూశాడు వాలి. పెద్ద అక్షరాల్లో "ద్రోహి" అని రక్తంతో రాయబడింది.

నేలమీద రక్తం మడుగులు. మౌనంగా వాలి వెనక్కి తిరిగాడు. రోడ్డుదాటి కూమ్‌నది వైపు చూస్తూ నిలబడ్డాడు.

ఇన్‌స్పెక్టర్ కేశవన్, గిరి అతడి ప్రక్కకొచ్చారు.

"వాలిగారూ, పత్రికా విలేఖర్లు రాబోతున్నారు," అన్నాడు కేశవన్.

వాలి కేశవన్ వంక సీరియస్‌గా చూశాడు.

"కేశవన్ భాయ్, ప్రెస్ విలేఖర్లు యీ దృశ్యాన్ని చూడ్డం మంచిదికాదు. చిత్రవధ చేయబడిన పద్మరాజు అవయవాల ఫోటోలు పత్రికల్లో ముద్రిస్తే ఉప్పెనలా ప్రజల్లో ఉద్రేకాలు చెలరేగుతాయి. శవ భాగాలను వెంటనే హాస్పిటల్‌కి పంపడం మంచిది. నా అనుమతి లేకుండా ఎవ్వరూ శవం దగ్గరకు వెళ్ళకూడదు. ఏ పరిస్థితుల్లోనూ ప్రెస్ ఫోటోగ్రాఫర్లు కెమేరాలను క్లిక్ చేయకూడదు," అన్నాడు వాలి.

ఇన్‌స్పెక్టర్ కేశవన్ శవం దగ్గరకు పరుగెత్తాడు. గిరి పక్కనున్న వాలి చెయ్యి పట్టుకున్నాడు.

"శివయ్యను నేను వదిలేయకపోతే యీ ఘోరం జరిగుండేదికాదు," అన్నాడు గిరి బాధతో.

"గిరీ! బాధపడకు. మనం ఏదో చేసుంటే యిలా జరిగుండేది కాదని అనుకుంటాం. కాని నుదుట విధి రాసింది జరుగుతూనే వుంటుంది," అన్నాడు వాలి.

యాంబులెన్స్ వచ్చింది. ఐదు నిమిషాల్లో పద్మరాజు శవ భాగాలను లోపలకు చేర్చారు.

ఇన్‌స్పెక్టర్ కేశవన్ తొందరచేయడం వలన యాంబులెన్స్ వెంటనే వెళ్ళిపోయింది.

రక్తం మడుగులమీద యిసుక జల్లేశారు. కొన్ని క్షణాల క్రితం కనిపించిన ఘోర దృశ్యం మాయమైంది.

రెండు కార్లొచ్చి ఆగాయి. ప్రెస్ విలేఖర్లు, ఫోటోగ్రాఫర్లు కిందకు దూకారు. ఇన్‌స్పెక్టర్ కేశవన్‌ని వాళ్ళు చుట్టేశారు.

వాలి చుట్ట పీలుస్తూ వాళ్ళవైపు నడిచాడు. అందరి చూపులూ వాలిమీదకు మళ్ళాయి.

"వాలిగారూ, ఎంతో ఆశతో మేమిక్కడికొచ్చాం. చూడ్డానికి శవంకూడా లేకుండా పోయింది," అన్నాడొక విలేఖరి.

"మీరు చాలా ఆలస్యంగా వచ్చారు," అన్నాడు వాలి క్లుప్తంగా.

"హత్య చేయబడినతను ఎవరు? అతడిని ఎందుకు చంపారు?" అడిగాడు మరో విలేఖరి.

"హత్య చేయబడిన వ్యక్తిపేరు పద్మరాజు. అతడికొక పాన్‌షాపు వుంది.

ఈ హత్య ఎందుకు జరిగిందో మేం పరిశోధించి కనుక్కోవాలి," అన్నాడు వాలి.

"మా కెమేరాలకు పని లేకుండా పోయింది!" అన్నాడొక ప్రెస్ ఫోటోగ్రాఫర్.

"కనీసం మీ ఫోటోలు తీయనియ్యండి," అన్నాడు రెండో ఫోటోగ్రాఫర్.

"మేం వద్దనలేదు," అన్నాడు వాలి నవ్వుతూ.

వాలి, గిరి, ఇన్‌స్పెక్టర్ కేశవన్ ఫోటోలను హుషారుగా వాళ్ళు తీశారు. ఫోటోల తతంగం ముగిసింది.

"హంతకుడిని పట్టుకునేందుకు మీకు ఏ క్లూసేనా దొరికాయా?" ప్రశ్నించాడొక విలేఖరి.

"కావలసినన్ని క్లూస్ దొరికాయి. త్వరలో హంతకుడు మా చేతుల్లో వుంటాడు. అది జరగ్గానే ప్రెస్ సమావేశం ఏర్పర్చి మీ కంతా చెప్తాం," అన్నాడు వాలి.

"థ్యాంక్స్ సార్. ప్రెస్ విలేఖర్లను అలా స్నేహభావంతో చూడాలి!" అన్నాడు విలేఖరి.

చల్లటి గాలి వీస్తోంది. ప్రెస్ విలేఖర్లు, ఫోటోగ్రాఫర్లు వారి కార్లలో వెళ్ళిపోయారు. వాలి, గిరి మెల్లిగా నడిచి కారు దగ్గరకు చేరుకున్నారు.

వాలి స్టీరింగ్ వీల్ వెనక కూర్చున్నాడు. బయట నిలబడిన యిన్‌స్పెక్టర్ వంక చూశాడు.

"కేశవన్ భాయ్! శివయ్యకోసం మనం వెతకాలి! అతడు దొరికితే అరటి పండు ఒల్చినట్లు మనకంతా తెలుస్తుంది," అన్నాడు వాలి.

"అతడికోసం యీ మహాపట్నంలో ఎక్కడ వెతుకుతాం?" అడిగాడు యిన్‌స్పెక్టర్.

"శివయ్య వుపయోగించే స్కూటర్ ఎవరిదో కనుక్కోవాలి. దాని నంబరు గిరికి తెలుసు."

గిరి చెప్పిన నంబర్ని యిన్‌స్పెక్టర్ రాసుకున్నాడు. "కనుక్కొని మీకు ఫోన్‌చేసి చెప్తాను, సార్," అన్నాడు కేశవన్.

"గుడ్‌నైట్," అని వాలి కారును పోనిచ్చాడు.

వాలి కారు వెనకనే గిరి కారు కదిలింది.

* * *



12

పడక కుర్చీలో కూర్చున్న వాలి కెదురుగా గిరి కూర్చున్నాడు

"వాలిగారూ, ఇన్‌స్పెక్టర్ కేశవన్ ఫోన్ చేశాడు. శివయ్య వుపయోగించే స్కూటర్ సినీయాక్టర్ శివరావుది. శివరావు అడ్రెస్ రాసుకున్నాను," అన్నాడు గిరి.

తటాలున వాలి కుర్చీలోంచి లేచాడు. అద్దం ముందుకు వెళ్ళి బుగ్గమీసాలను నిమురుకున్నాడు.

"గిరీ, వెళ్దాం పద," అన్నాడు వాలి.

ఇద్దరూ హోటల్ గదిలోంచి బయటకు వచ్చారు. హోటల్‌ముందు హాల్లోంచి నడిచి యక్స్ వై జెడ్ కారు దగ్గరకు చేరుకున్నారు.

ముందుసీటుమీద వాలి మౌనంగా కూర్చున్నాడు. గిరి కారును పోనిచ్చాడు.

"ఎక్కడి కెళ్ళాలి?" అడిగాడు వాలి.

"శివరావు యిల్లు కె. కె నగర్‌లో వుంది. చాలా దూరం వెళ్ళాలి," అన్నాడు గిరి.

కె కె. నగర్‌లోని ఒక చిన్నయింటి ముందు కారును ఆపాడు గిరి.

"యీ యిల్లే," అన్నాడతను.

వాలి కిందకు దిగాడు. పిట్టగేటు తెరుచుకొని అతడు లోపలకు వెళ్ళాడు. గిరి అతడిని వెంబడించాడు.

ముందు తలుపు తెరిచివుంది. కాని ఎవ్వరూ లేరు. తలుపుమీద తట్టాడు వాలి. పెరట్లో బట్టలు వుతుకుతున్న ఒక స్త్రీ గుమ్మం దగ్గరకొచ్చింది.

ఆమె దుస్తులు కొద్దిగా తడిసి వున్నాయి. ఆమె అంత అందంగా లేదు.

"అమ్మాయ్! శివరావు కావాలి," అన్నాడు వాలి.

"ఆయన నిద్రపోతున్నారు," అందామె.

"పది దాటింది, యింకా నిద్రపోతున్నాడా?" అన్నాడు వాలి ఆశ్చర్యంగా.

"తొందరగా లేవ రాయన," అందామె.

"అతడు ఏ గదిలో వున్నాడు?"

ఆమె ఎడంవైపున్న గదివైపు చూపించింది.

లోపలకు నడిచి, తలుపుతోసి వాలి గదిలోకి నడిచాడు. నేలమీద పరిచిన పరుపుమీద శివరావు గుర్రుపెడ్తూ నిద్రపోతున్నాడు.

గదిలోకొచ్చిన గిరి అతడిని తట్టి లేపాడు. కళ్ళు నలుపుకుంటూ శివరావు లేచి కూర్చున్నాడు.

పరుపు పక్కనే ఒక బ్రాందీ బాటిల్, గ్లాసు, నాలుగు సోడాబుడ్లు వున్నాయి. అన్నీ ఖాళీగా వున్నాయి.

శివరావు చూపు వాలిమీద కెళ్ళింది. ఉలిక్కిపడ్తూ అతను లేచి నిలబడి నమస్కరించాడు.

"ఇలా పరుపుమీద కూర్చోండి సార్, ఇంట్లో కుర్చీలన్నీ రిపేరుకెళ్ళాయి," అన్నాడతను.

"అబ్బాయ్, శివయ్య అనే అతడు నీ స్కూటర్మీద తిరుగుతున్నాడు," అన్నాడు వాలి.

"కొంపతీసి ఏదేనా యాక్సిడెంట్ చేశాడా?" ప్రశ్నించాడు శివరావు.

శివరావు పసిపిట్టలా వాగుతాడని వాలి గ్రహించాడు.

"శివయ్య అడ్రెస్ కావాలి," అన్నాడు వాలి.

వాడి అడ్రెస్ నాకు తెలియదు సార్. వాడే యిక్కడకు వస్తూ వుంటాడు."

"అతడికి నీ స్కూటర్ అద్దెకిచ్చావా?"

శివరావు సీరియస్గా వాలివంక చూశాడు.

"ఈ ప్రశ్నలన్నీ ఎందుకేస్తున్నారు సార్?"

"నీ జవాబులు వినడంకోసం," అన్నాడు వాలి.

"వాడికి నా స్కూటర్ అద్దెకివ్వలేదు. ఈ మధ్య నా మార్కెట్ చెడింది.

నాకు ఫిలిం బుకింగ్స్ లేవు ఎప్పుడో కొన్న స్కూటర్ యింట్లో పడివుండేది. పెట్రోలు కొనడానికికూడా నా దగ్గర డబ్బులేదు అందువలన అతడి కిచ్చాను," అన్నాడు శివరావు

"స్కూటరిచ్చినందుకు బ్రాందీ బాటిల్సు శివయ్య నీకు సప్లయి చేస్తున్నా డనుకుంటాను," అన్నాడు వాలి.

"మీకు నిజం తెల్సాక నేను ఒప్పుకోక తప్పదు. అతడు బ్రాందీ బుడ్ల రూపంలో నాకు యిస్తూవుంటాడు. కాని తాగలేని స్థితిలో వున్నాను, సార్. తాగటం మానలేను," అన్నాడతను.

"అంత బానిసత్వం మంచిదికాదు," అన్నాడు వాలి.

"పెద్దలు బాగా చెప్పారు. తాగుడు మానేస్తాను!"

"శివయ్య యిక్కడకు ఎప్పుడొస్తాడు?"

"రోజూ వస్తాడు. నేనున్నాలేకపోయినా హాఫ్ బాటిల్ యింట్లో యిచ్చి వెళ్ళిపోతాడు."

అతడివైపు వాలి నవ్వుతూ చూశాడు.

"అబ్బాయ్! మాతో సహకరిస్తే, నీకు ఫిలిం బుకింగ్స్ వచ్చేటట్లు నేను చూస్తాను," అన్నాడు వాలి.

"ఏం చెయ్యాలో చెప్పండి సార్!"

"శివయ్య మాకు కావాలి. ఇతడి పేరు గిరి. ఇతను నీతో యిక్కడ వుంటాడు. శివయ్య రాగానే అతడిని గిరికి పరిచయం చెయ్యి. మాకు నూరు బుడ్డీలు కావాలి. గిరి వెంటనే కాష్ చెల్లిస్తాడు," అన్నాడు వాలి.

"అలాగే సార్," అన్నాడు శివరావు.

"బుడ్డికి ఐదురూపాయల చొప్పున కనీసం ఆరు వందలు నీకు కమిషన్ వస్తుంది," అన్నాడు వాలి

"మీ దయ సార్! దేవుడిలా వచ్చారు ఇంటి అద్దె బాకీపడ్డాను. ఈ కమిషన్‌తో చెల్లించవచ్చు."

వాలి బయటకు నడిచాడు. గిరి అతడి వెనకనే వెళ్ళాడు. శివరావు మొహం కడుక్కోడానికి పెరట్లోకెళ్ళాడు.

"గిరీ, నేను యీ ప్రాంతంలోనే వుంటాను. శివయ్యను పిస్టల్‌తో భయపెట్టి యిక్కడుండమను! నేను వెంటనే యిక్కడికొస్తాను,'' అన్నాడు వాలి

"అలాగే సార్," అన్నాడు గిరి.

వాలి కార్లో కూర్చుని తలుపు మూశాడు. కారు కదిలింది. గిరి లోపలకు వెళ్ళాడు. మొహం తుడుచుకుంటూ శివుడిలా ప్రత్యక్షమయ్యాడు.

"ప్లీజ్ పరుపుమీద కూర్చోండి!" అన్నాడతను.

పరుపుమీద గిరి చతికిలబడ్డాడు.

"మీకు హాట్ కాఫీ వస్తోంది. నా భార్య కాఫీ బాగా చేస్తుంది," అన్నాడతను.

గుమ్మం బయటనుంచి ఓ స్త్రీ కంఠం వినపడింది. "కాఫీ పట్టుకెళ్ళండి," అందామె.

శివరావు పరుగెత్తుకెళ్ళి రెండు గ్లాసులతో లోపలకొచ్చి, ఒక గ్లాసును గిరికిచ్చాడు.

"క్షమించండి. పాలను పిల్లి తాగేసిందట. మా ఆవిడ బ్లాక్ కాఫీ యిచ్చింది," అన్నాడతను.

నవ్వుతూ గిరి గ్లాసులోని బ్లాక్ కాఫీ రుచి చూశాడు.

"ఫైన్! పిల్లి పాలను తాగేసినందుకు మనం విచారించనవసరంలేదు," అన్నాడు గిరి నవ్వుతూ.

* * *

13

వినాయకుడి గుడి ప్రక్కనే కారాపి, సీటుమీద కూర్చుని వున్నాడు వాలి. గుడి చిన్నది. గేటు తెరిచివుంది. గుడి ఆవరణలో వున్న నూతి చుట్టూ చాలా మంది స్త్రీలు వున్నారు.

నీళ్ళు తోడుకుని, బిందెలను భుజాలమీద పెట్టుకొని స్త్రీలు యిళ్ళకు పోతున్నారు. కొత్తవాళ్ళు ఖాళీ బిందెలతో నూతి దగ్గరకు వెళ్తున్నారు.

వాళ్ళ కబుర్లు వింటూ, చుట్టపొగ వదుల్తూ వాలి మౌనంగా కూర్చున్నాడు. క్రాస్ స్ట్రీట్‌లో వున్న శివరావు యిల్లు అతడికి కనిపిస్తోంది.

ఈ సారి గిరి శివయ్యను వదలడు! ఉడుంలా పట్టుకుంటాడు. శివయ్య ద్వారా విషయాలు తెలుస్తాయి' వాలి ఆలోచిస్తున్నాడు.

టైమ్ ఒంటిగంట కావస్తోంది శివరావు, గిరి రమ్మీ ఆడుతున్నారు. బయట స్కూటర్ ఆగిన చప్పుడైంది.

"శివయ్య వచ్చుంటాడు," అన్నాడు శివరావు.

ఎవరో లోపలకు వస్తున్నారు. గిరి చెయ్యి జేబులో కెళ్ళి పిస్టల్ని పట్టుకొంది.

''రావయ్యా మహాత్మా, నీ కోసమే చూస్తున్నాం,'' అన్నాడు శివరావు గదిలోంచి.

గదిలోకొచ్చిన మనిషివైపు అతడు ఆశ్చర్యంగా చూశాడు. శివయ్య కాదు!

''స్కూటర్ని లోపల పెట్టాను సార్. కీ యిదిగో!'' అన్నాడతను.

శివరావు కీని అందుకున్నాడు.

''శివయ్య ఏడీ ?''

''ఈ స్కూటర్ని మీ కియ్యమన్నాడతను. ఏదో అర్జంట్ పనుందట. వెళ్ళిపోయాడు,'' అన్నాడతను.

బయట కారు ఆగింది. వాలి గబగబా గదిలోకొచ్చాడు.

"శివయ్య రాలేదు, సార్," అన్నాడు శివరావు.

స్కూటర్ తెచ్చిన మనిషివంక చూశాడు వాలి. కారు మెకానిక్‌లా వున్నాడతను. అతడు ధరించిన పాంటు, స్లాక్ నిండా గ్రీజ్ మరకలున్నాయి.

"నీ పేరు?" అడిగాడు వాలి.

"త్యాగరాజు, సార్. గ్రీన్ ఆటోవర్క్స్‌లో పనిచేస్తున్నాను."

"శివయ్య అడ్రెస్ తెలుసా?"

"తెలియదు, సార్," అన్నాడతను.

"ఈ స్కూటర్ నీ కెవరిచ్చారు?"

"మా కంపెనీకొచ్చాడు శివయ్య. ఈ స్కూటర్ని తీసుకెళ్ళి యిక్కడివ్వమన్నాడు."

"శివయ్య కంపెనీలో వున్నాడా?"

"టాక్సీలో వెళ్ళిపోయాడు, సార్."

వాలి అతడివంక సూటిగా చూశాడు.

"మాకు అర్జంటుగా నూరు బ్రాందీ బాటిల్స్ కావాలి! నువ్వు యిప్పించగలవా?" ప్రశ్నించాడు వాలి.

"దాన్ని గురించి నాకేమీ తెలియదు, సార్!" అన్నాడతను.

త్యాగరాజును వాలి వెళ్ళిపోనిచ్చాడు. అతడు రోడ్డమ్మట నడిచిపోతున్నాడు.

వాలి జాలిగా శివరావువంక చూశాడు.

"అబ్బాయ్! నీకు సహాయం చేయాలనుకున్నాను. కాని కథ అడ్డం తిరిగింది," అన్నాడు వాలి.

"ఏల్నాటి శని ఏల్తూవుంటే అలాగే వుంటుంది, సార్," అన్నాడు శివరావు.

వాలి, గిరి బయటకు కదిలారు. గిరి కారును మెల్లిగా పోనిస్తున్నాడు. దూరంలో నడుస్తున్న త్యాగరాజు రూపం అతడికి కనిపిస్తోంది.

"మనం యిక్కడున్నామని పసిగట్టి శివయ్య అతడిని పంపించి వుంటాడు. గో స్లో! త్యాగరాజు ఎక్కడో శివయ్యను కల్సుకోవచ్చు," అన్నాడు వాలి.

రోడ్డు పక్కనున్న గ్రీన్ ఆటోవర్క్స్ షెడ్‌లోకి త్యాగరాజు దూరాడు.

ఆ షెడ్ ముందు గిరి కారును ఆపి చూశాడు. అరడజనుమంది మెకానిక్‌లు కార్లను రిపేరు చేస్తున్నారు. శివయ్య ఎక్కడా పత్తాలేదు!

"గిరీ! మనం అనుకున్నట్లు జరగలేదు. శివయ్య మన ప్రాంతాలకు రాకుండా తప్పించుకున్నాడు. ఇటుపైన శివరావు స్కూటర్ని అతడు వాడకపోవచ్చు," అన్నాడు వాలి.

కారు కదిలింది. ఇరవై నిమిషాల్లో హోటల్ అశోక్ కాంపౌండ్‌లో కారాగింది.

వాలి తన గదివైపు వేగంగా వెళ్ళాడు. పడక కుర్చీలో కూర్చుని కళ్ళు మూసుకున్నాడు. ఎటు వెళ్ళినా పరిశోధన ముందుకు సాగడంలేదు. ప్రారంభించిన మెట్టుమీదే నిల్చిపోతోంది.

టెలిఫోన్ మ్రోగింది.

"హలో, వాలి హియర్," అన్నాడతను.

"ఇన్‌స్పెక్టర్ కేశవన్ సార్. శివరావుని కల్సుకున్నారా? శివయ్య ఆచూకీ తెలిసిందా?" అడిగాడతను.

"కేశవన్ భాయ్! ప్రస్తుతం ఎదురుగాలి వీస్తోంది. మరి కొన్నిరోజులు ఓపికపడ్తే పరిస్థితులు మార్తాయి. చేతిలోని ముద్ద నోట్లోకెళ్ళే అదృష్ట మింటుంది," అన్నాడు వాలి మందహాసంతో.

* * *

14

బెంగుళూర్!

గంట క్రితం వాలి, గిరి విమానంలో బెంగుళూరు చేరుకున్నారు హోటల్ వెస్టెండ్‌లో గది తీసుకున్నారు.

బయటకెళ్ళిన గిరి హుషారుగా గదిలోకొచ్చాడు పడక కుర్చీలో కూర్చున్న వాలి అతడివంక నవ్వుతూ చూశాడు.

"గోల్డెన్ లారీ సర్వీస్ అనూరాధ యింట్లోనే వుంది. ఆమెతో మాట్లాడి మీ గురించి చెప్పాను. మనల్ని సరిగ్గా పదకొండింటికి రమ్మందామె," అన్నాడు గిరి.

హోటల్ మేనేజర్‌తో మాట్లాడి మనకొక కారు అరేంజి చేయమను," అన్నాడు వాలి.

గిరి బయటకెళ్ళాడు. వాలి టైమ్ చూశాడు పది కావస్తోంది.

అతడికి అనూరాధ మొహం లీలగా గుర్తుంది. మోహనరాజు రిటైరయినాక ఆమెను పెళ్ళాడాడు. ఒక పార్టీలో వాళ్ళిద్దర్నీ చూశాడతను.

గిరి లోపలకొచ్చాడు.

"ఒక బ్యాక్ కారు మనకోసం రెడీగా వుంది," అన్నాడు గిరి

"మంచిది, అరగంట తర్వాత వెళ్దాం," అన్నాడు వాలి.

గిరి సోఫాలో కూర్చుని వాలివైపు సూటిగా చూశాడు.

"ఆమెను కల్సుకోడం వలన మనకేదేనా వుపయోగం వుంటుందంటారా?" అడిగాడతను.

"ప్రస్తుతం నేను చెప్పలేను. మొదటినుంచీ ఒక అనుమానం నన్ను పీక్కు-తింటోంది. ఫియట్ కారులో దొరికిన రెండు బాటిల్సు కారణంగా వాళ్ళు సబిన్‌స్పెక్టర్ శివరామ్‌ని హత్యచేసి వుండరు. గోల్డెన్ లారీ సర్వీస్ వారి రెండు లారీలను అతడు చెక్ చేయించి వుంటాడు. వాటిలో ఏదో అతను చూసుండాలి ఫియట్ కారులో వచ్చినవాళ్ళు లారీలకు గార్డ్సు కావచ్చు! ఆ లారీ సర్వీస్‌ను అనూరాధ నడుపుతోంది!" అన్నాడు వాలి.

"ఆ లారీలను చెక్ చేసినట్లు, వాటిలో బుడ్డీలు వున్నట్లు కానిస్టేబుల్స్ మనతో చెప్పలేదు," అన్నాడు గిరి.

వాలి విచిత్రంగా నవ్వాడు.

"వాళ్ళు మాటల్లో చెప్పలేదు. వాళ్ళు అదంతా కప్పిపుచ్చుతున్నారని నే ననుమానించాను. గిరీ, మన పరిశోధన ఒక వైపే వెళ్ళకూడదు. నలువైపులా తిరగాలి. ఒకవైపు వెళ్తే అడ్డుపడిన గోడ మరో వైపున లేకపోవచ్చు," అన్నాడు వాలి.

గిరి టైం చూసి సోఫాలోంచి లేచాడు. ఇద్దరూ గదిలోంచి బయటకు నడిచారు.

బ్యాక్ కారును గిరి పోనిస్తున్నాడు. సూర్యుడు ఆకాశంలో ప్రకాశిస్తున్నాడు. కాని అంత వేడిగాలేదు. చల్లటి గాలి వీస్తోంది.

ఎత్తుగా వున్న యినపగేటు మూసివుంది. వాలివంక ఓసారి చూసి వాచ్‌మన్ గేటును తెరిచాడు. గిరి కారును లోపలకు పోనిచ్చాడు.

చక్కటి సిమెంట్ రోడ్డు రోడ్డు కిరువైపులా పూలమొక్కలున్నాయి. రంగు రంగుల పూలవైపు వాలి ఆనందంతో చూశాడు. తెల్లటి మేడముందు పోర్టికోలో కారును ఆపి గిరి దిగాడు.

వాలి కింద అడుగు పెట్టాడు. తెల్లటి యూనిఫామ్‌లో వున్న నౌఖరు కారు దగ్గరకొచ్చి వాలికి శల్యూట్ చేశాడు

"రండిసార్," అన్నాడతను.

ముందు వరండా ఫ్లోరింగ్ తగధగ మెరుస్తోంది. విశాలమైన హాల్లోకి వెళ్ళాడు వాలి. వెనకనే వున్నాడు గిరి.

హాల్లో యాభై సోఫాలున్నాయి. కప్పునుంచి శాండిలియర్స్ వేళ్లాడుతున్నాయి. మొజాయిక్ ఫ్లోరింగ్ కళ్ళ కింపుగా వుంది.

"కూర్చోండి, సార్. అమ్మగారితో చెప్తాను." అని యూనిఫామ్‌లో వున్న నౌకరు లోపలకు వెళ్ళాడు.

ఎదురుగా వున్న గోడ మధ్యలో లైఫ్ సైజులో మోహనరాజు ఆయిల్ పెయింటింగ్ అమర్చబడి వుంది.

ఆ పెయింటింగ్ వైపు చుట్టపొగ వదుల్తూ చూశాడు వాలి. కళ్ళముందు మోహనరాజు నిలబడినట్లుంది!

చూడీదార్ పైజామా, పొడుగాటి షేర్వాణీ, తలపాగా, గుబురుగా పెరిగిన మీసాలు, పెద్ద కళ్ళు, కోల మొహం, కాళ్ళకు కాశ్మీర్ స్లిప్పర్స్ - ఆ పెయింటింగ్‌లో మోహనరాజు ఏ రాజ్యాన్నో ఏలే మహారాజులా కనిపిస్తున్నాడు.

హైహీల్డ్ స్లిప్పర్స్ చప్పుడు వినపడింది. కాస్సేపట్లో అనూరాధ నవ్వుతూ హాల్లో కొచ్చింది. ఆమెను చూసి గిరి ఉలిక్కిపడ్డాడు !

ఆనాటి రాత్రి కార్లోంచి దిగి శివయ్య వున్న రెస్టారెంట్‌లోకి వెళ్ళిన స్త్రీ ఆమే!

ఆమె ఇద్దరికీ నమస్కరించింది. విచారవదనంతో వాలివంక చూసింది.

"ఆయన చనిపోయి మూడేళ్ళయింది. బతికుంటే మిమ్మల్ని చూసి ఆయన ఎంత సంతోషించేవారో!" అందామె.

"అమ్మాయ్! మోహనరాజు తన మిత్రులకు ప్రాణం యిచ్చేవాడు. కాశ్మీర్‌లోని డాల్ లేక్‌లా అతడి హృదయం చాలా విశాలమైంది," అన్నాడు వాలి.

యూనిఫామ్డ్ నౌఖరు ట్రే తో వచ్చాడు. వాలి పక్కనున్న టీపాయిమీద ట్రే వుంచి వెళ్లిపోయాడు.

ట్రేవైపు ఆత్రంగా చూశాడు గిరి. ప్లమ్స్, యాపిల్ పళ్లు, ద్రాక్షపళ్ళు ట్రేలో ఒకవైపు వున్నాయి రెండోవైపున తెల్లటి కెటిల్, రెండు కాఫీ కప్పులు, సాసర్లు వున్నాయి.

"పళ్లు తీసుకోండి!" అందామె.

ఇద్దరూ పళ్ళు తినసాగారు. తింటూ గిరి ఆమెకేసి చూశాడు. ఆమెవయస్సు ముప్పయి ఏళ్ళు దాటి వుండొచ్చు, కాని పైకి చిన్నదానిలా కనిపిస్తోంది. రెస్టారెంట్ ముందు తనను చూసిన విషయం ఆమెకు గుర్తులేకపోవచ్చు!

రెండుకప్పుల్లో గిరి వేడి కాఫీ పోశాడు. ఇద్దరూ కాఫీ త్రాగడం ముగించారు.

"అమ్మాయ్, గోల్డెన్ లారీ సర్వీస్‌ను నువ్వు నడుపుతున్నావని విన్నాను," అన్నాడు వాలి.

ఆమె కిలకిల నవ్వింది.

"వాలిగారూ, కూర్చుని తింటే కొండలు కూడా తరిగిపోతాయి నా భర్త చాలా ఆస్తిని నాకు వదిలి వెళ్ళిపోయారు. ఆయన డబ్బును అనేక వ్యాపారాల్లో పెట్టాను. అందులో గోల్డెన్ లారీ సర్వీస్ ఒకటి," అందామె.

"ఆ కంపెనీ విషయాలు నువ్వే స్వయంగా చూస్తూ వుంటావా ?"

"నాలాటి స్త్రీలు లారీ కంపెనీలను నడపడం కష్టతరమైన పని సార్. అదంతా బుచ్చయ్య చూసుకుంటాడు."

"బుచ్చయ్య ఎవరు ?"

"ఆ కంపెనీ జనరల్ మేనేజర్. నా చేత ఆ కంపెనీని అతడే కొనిపించాడు. అతడినే దానికి మేనేజర్‌గా నియమించాను."

"బుచ్చయ్య ఎక్కడుంటాడు ?"

"అతడు ఒకచోట వుండడు. బెంగుళూరు, మద్రాస్, హైద్రాబాద్‌ల మధ్య తిరుగుతూవుంటాడు."

"ప్రస్తుతం అతడెక్కడున్నాడు ?"

"మద్రాసులో," అందామె.

యూనిఫామ్‌లోవున్న నౌకరు దగ్గరగా వెళ్ళి ఆమె కేదో చెప్పాడు.

"క్షమించండి, ఇప్పుడే వస్తాను," అని ఆమె లోపలకు వెళ్ళిపోయింది.

''వాలిగారూ! శివయ్య రెస్టారెంట్‌లోకి వెళ్ళాక ఒక యువతి కార్లోంచి దిగి రెస్టారెంట్‌లోకి వెళ్ళిందని మీతో చెప్పాను, గుర్తుందా ?" అడిగాడు గిరి.

వాలి తలాడించాడు.

"ఆ యువతి ఈమేనా ?" అడిగాడు వాలి.

"మీరు ఎలా ఊహించారు ?" అడిగాడు గిరి.

వాలి కిలకిల నవ్వాడు.

"గిరీ, ఆమె గదిలోకి రాగానే నువ్వు తృళ్ళిపడ్డావు !" అన్నాడు వాలి.

అనూరాధ హాల్లోకి తిరిగొచ్చి సోఫాలో కూర్చుంది. వాలి ఆమెవంక చూశాడు.

"అమ్మాయ్, మీ లారీలను మత్తుద్రవాలను స్మగుల్ చేసేందుకు ఉపయోగిస్తున్నారని పుకార్లు వున్నాయి,'' అని వాలి ఆమె ముఖంవైపు చూశాడు.

ఆమె కనురెప్పలను చిట్లించింది. బిగుసుకుపోయిన ఆమె ముఖంలో మెరుపులా చిరునవ్వు నాట్యమాడింది.

''వాలిగారూ, స్మగ్లర్స్ మా లారీ లేమిటి, ఏది కనిపిస్తే అందులోనే రహస్యంగా సరఫరా చేస్తారు. ట్రెయిన్లలో ఎంతో సరకు పంపబడుతోందని ఎవరో అంటే విన్నాను,'' అందామె.

''నీ కంపెనీ పూర్తిగా బుచ్చయ్య చేతులమీద నడుస్తోందా ?" అడిగాడు అతను.

"అలాగే అనుకోవాలి. నేను మామూలు విషయాల్లో జోక్యం చేసుకోను. ఖర్చులూ, లాభాలూ చూస్తూవుంటాను.''

''బుచ్చయ్య ఎటువంటివాడు ?"

"మంచివాడే. నన్ను మోసం చేయడానికి యింతవరకూ ప్రయత్నించలేదు. నాలాటి ఒంటరిదాన్ని మోసంచేయాలని ఎందరో స్నేహం నటిస్తారు. బుచ్చయ్య అటువంటివాడు కాదు.''

"అతడితో నీ కెలా పరిచయమైంది ?"

"అతడు మోహనరాజుగారికి తెలుసు. అప్పుడప్పుడు వచ్చి ఆయనతో మాట్లాడిపోయేవాడు. ఆ స్నేహం నా భర్త పోయినా నిల్చింది," అందామె.

"అమ్మాయి, నువ్వు తరచు మద్రాస్ వెళ్తుంటావా ?"

"గతవారంలో వెళ్ళివచ్చాను, అందామె.

"గత వారంలోనే గిరి ఆమెను రెస్టారెంట్ ముందు చూశాడు. అనూరాధ నిజం చెప్పింది! నిజం వాళ్ళకు తెలుసునని గ్రహించి ఆమె నిజం చెప్పిందేమో!

వాలి మెదడులో ఆలోచనలు సాగుతున్నాయి.

"అమ్మాయ్, ఒకనాటి రాత్రి నేనూ, గిరీ నిన్ను మద్రాసులో చూశాం. నువ్వొక రెస్టారెంట్‌లోకి వెళ్ళావు. కాబిన్ లోపలి కెళ్ళి కూర్చున్నావు. నీకంటే ముందు అదే కాబిన్‌లోకి శివయ్య వెళ్ళాడు!" అన్నాడు వాలి.

ఆమె కోపంగా వాలివైపు చూసింది.

"మీ మాటలు విచిత్రంగా వున్నాయి. శివయ్య ఎవరో నే నెరగను," అందామె.

అమాంతంగా వాలి సోఫాలోంచి లేచి ఆమె ముందు కెళ్లాడు. అనూరాధ పెదిమలు వణుకుతున్నాయి !

"అమ్మాయ్, శివయ్యను వెంటాడుతూ మేం ఆ రెస్టారెంట్‌కి వచ్చాం. శివయ్య నీకు తెలియని మనిషయితే నువ్వు వెంటనే బయటకు వచ్చేసేదానివి, కాని నువ్వు రాలేదు," అన్నాడు వాలి.

ఆమె జవాబివ్వలేదు. వాలివంక భయంతో చూస్తూ వుండిపోయింది.

"అమ్మాయ్ శివయ్య మద్రాసులో హత్యలు చేశాడు. అతడు పోలీసుల చేతుల్లో వున్నాడు. అతడితో మాట్లాడాక నే నిక్కడికి వచ్చాను,'? అని వాలి అబద్ధమాడాడు.

ఆమె తటాలున సోఫాలోంచి లేవబోయింది. వాలి చేత్తో ఆమె భుజంమీద నొక్కాడు.

[illegible] ఆ రెస్టారెంట్‌లో శివయ్య ఆనాటి రాత్రి నీకు డబ్బిచ్చాడు. అవునా ?"

"ఇచ్చాడు," అందామె.

"ఎంత ?"

"నేను లెక్కపెట్టలేదు. నోట్లున్న కవర్లను బుచ్చయ్య కిచ్చేశాను."

"నువ్వు బుచయ్య బాస్‌వి ! శివయ్యను కల్సుకొని ఆ డబ్బు తీసుకోవలసిన ఖర్మ నీ కెందుకు పట్టింది ?" అర్చాడు వాలి.

"వాలిగారూ! ఆ రెస్టారెంట్‌కి వెళ్లి డబ్బు తెచ్చి తన కివ్వమన్నాడు బుచ్చయ్య. అతడు దుర్మార్గుడు. అతడిని ఎదిరించే ధైర్యం నాకు లేదు. అతడు నన్ను బానిసగా చేసి ఆడిస్తున్నాడు!" అందామె.

"అతడి పార్ట్‌నర్‌గా నువ్వు అదంతా చేసుండాలి!"

ఆమె వాలివంక కన్నీళ్ళతో చూసింది.

"వాలిగారూ, గతంలోకి వెళ్తేగాని మీకు నా పరిస్థితి అర్థంకాదు. నేను మావయ్య ఇంట్లో పెరిగాను. బలాత్కారంగా నన్నొక మూగివాడి కిచ్చి పెళ్లి చేసేశాడు. సంవత్సరంపాటు నా భర్తతో జీవించి, విసుగెత్తి మద్రాసుకు పారిపోయాను మద్రాసు చేరాక హమీద్ అనే వ్యక్తితో నాకు స్నేహమైంది. అతడితో వుండేదాన్ని.

"ఒకనాడు ఏదో పార్టీకి హమీద్ నన్ను తీసుకెళ్లాడు. అక్కడ మోహనరాజుగార్ని కలుసుకున్నాను. ఆయన నన్ను తనతో బెంగుళూరు రమ్మన్నారు. హమీద్‌ని వదిలేసి బెంగుళూరు వెళ్ళాను. మోహనరాజుగారు కోటీశ్వరులు. ఆయన ముసలివాడైపోయాడు. కాని ఆయనలో స్త్రీ వ్యామోహం చావలేదు. అప్పటిలో లోకం నాకు డబ్బురూపంలోనే కనిపించేది!

"నే నాయన్ని రిజిస్టర్ మేరేజి చేసుకున్నాను. నా జీవితం సుఖంగా సాగి పోతోంది. ఆ సమయంలో నన్ను వెతుక్కుంటూ బుచ్చయ్య ప్రత్యక్ష మయ్యాడు. అతడు నన్ను బ్లాక్ మెయిల్ చేయడం ప్రారంభించాడు" అని అందామె.

"అతడు ఎందుకు బ్లాక్ మెయిల్ చేశాడు?"

"నా మొదటి భర్త బ్రతికున్నాడు. నేను డైవర్స్ చేయలేదు. అందువలన మోహనరాజుగారితో జరిగిన నా పెళ్ళి చట్టప్రకారం రద్దు అవుతుందన్నాడు. ఆయన ఆస్తి నాకు రాదన్నాడు. తనకు డబ్బు చెల్లిస్తూవుంటే నా మొదటి భర్త గురించి ఎవ్వరికీ చెప్పనన్నాడు. డబ్బిచ్చి అతడి నోరు మూశాను. రోజులు గడిచినకొద్దీ బుచ్చయ్య ఆశలు పెరిగాయి. డబ్బుతో అతడికి తృప్తి లేకుండా పోయింది. అతడి చూపు నామీద పడింది. అతడికి లొంగిపోవలసి వచ్చింది. ఇంతలో మోహనరాజుగారు మరణించారు. ఆయన ఆస్తి నా చేతి కొచ్చింది. బుచ్చయ్య నన్ను బానిసగా చేసి ఆడిస్తున్నాడు. వాలిగారూ, అతడి నుంచి నాకు విముక్తి లభించేటట్లు చూడండి! ఇటుపైనేనా స్వేచ్ఛగా నేను జీవించే అవకాశాన్ని కల్పించండి," అందామె.

ఆమె కళ్ళమ్మట నీళ్ళు కారుతున్నాయి. సానుభూతితో గిరి ఆమె ప్రక్కకు కదిలాడు. జేబురుమాలును ఆమెకిచ్చాడు.

వాలి ఆమెకేసి సూటిగా చూశాడు.

"అమ్మాయ్! మానవుల్లో వున్నత విలువలు క్షీణించినపుడు, దురాశ పెరిగి నపుడు నీలాగే బాధపడవలసి వస్తుంది," అన్నాడు వాలి.

"అదంతా ఇప్పుడు తెల్సుకున్నాను సార్, కాని బుచ్చయ్య సాలెగూడు లోంచి బయటపడలేకపోతున్నాను."

"సాలెగూళ్ళు నేలకూలవలసిన సమయం రాక తప్పదు," అన్నాడు వాలి క్లుప్తంగా.

క్షణకాలం వాలి ఆమె ముందు పచార్లు చేశాడు. ఆగి ఆమెకేసి సీరియస్‌గా చూశాడు.

"ఏదీ దాచకుండా నా కంతా చెప్పావా?"

"అంతా చెప్పాను సార్. నన్ను కాపాడమని మిమ్మల్ని వేడుకుంటున్నాను," అందామె.

"నీకు ప్రమాదం రావచ్చని భయపడుతున్నావా?"

"ఇదంతా మీకు చెప్పాక బుచ్చయ్య నన్ను వదలడు. తన కసి తీర్చు కుంటాడు," అంది అనూరాధ.

"నీకు బాడీగార్డుగా వుండేందుకు ఒక వ్యక్తిని యిక్కడకు వెంటనే వంపిస్తాను," అని వాలి హాల్లోంచి బయటకు నడిచాడు.

గిరి నవ్వుతూ ఆమెకు బై బై చెప్పాడు.

"కొంతకాలంపాటు నా బాడీగార్డుగా మీరుండకూడదూ!" అందామె.

కారు హారన్ మ్రోగింది బయటనుంచి. గిరి హాల్లోంచి కారు దగ్గరకు పరుగెత్తి, ముందు సీటుమీద కూర్చుని తలుపు మూశాడు. వాలి కారును పోనిచ్చాడు.

* * *

15

గోల్డెన్ లారీసర్వీస్ ఆఫీసు కాంపౌండులో కారాపి గిరి, వాలి దిగారు. అరడజను లారీలు కాంపౌండులో వున్నాయి.

ముందు హాల్లోకి వెళ్ళాడు వాలి. యాభైమంది గుమస్తాలు వాళ్ళ పనుల్లో నిమగ్నులై వున్నారు. పక్కనున్న బుకింగ్ ఆఫీసునుంచి కేకలు వినిపిస్తున్నాయి.

రిసెప్షన్ బోర్డున్న టేబుల్ ముందుకు నడిచాడు వాలి. ఒక ఆంగ్లో ఇండియన్ యువతి అతడివైపు నవ్వుతూ చూసింది.

"బుచ్చయ్యతో మాట్లాడాలి," అన్నాడు వాలి.

"ఆయన నిన్న బొంబే వెళ్ళారు," అందామె.

"బొంబేలో అతడెక్కడుంటాడు?"

"చెప్పలేను సార్. ఏ హోటల్లోనో వుంటారు," అందామె.

వాలి బయటకు నడిచాడు. ఆంధ్రానుంచి వచ్చిన లారీలోంచి పెట్టెలను, పార్శిల్సును కిందకు దింపుతున్నారు. గిరి అక్కడ నిలబడి పార్శిల్సును చూస్తున్నాడు. వాలి అతడి ప్రక్కకు నడిచాడు.

"ఈ లారీలో ఒక పుస్తకాల కంపెనీకి వంద పార్శిల్సు వచ్చాయి," అన్నాడు గిరి.

"పుస్తకాల అమ్మకం అంతగా పెరిగుంటుంది," అని వాలి పార్శిల్సు వైపు చూశాడు

గోనిలో పుస్తకాలు అమర్చి కుట్టేశారు. బాలాజీ బుక్ డిస్ట్రిబ్యూటర్, మద్రాస్-1 అని ఎర్ర సిరాతో గోనెమీద రాసివుంది.

"ఒక పార్శిల్‌ని విప్పిచూడు!" అన్నాడు వాలి.

గిరి పనిలోకి దిగాడు. కుట్లను కత్తితో కోసేశాడు. ఒక గుమస్తా దగ్గరకు పరుగెత్తుకొచ్చాడు.

"ఏమిటి సార్ చేస్తున్నారు?" అరిచాడు గుమస్తా.

"ప్రొహిబిషన్ డిపార్ట్‌మెంట్! చెక్ చేస్తున్నాం," అన్నాడు వాలి.

గుమస్తా లోపలకు పరుగెత్తాడు.

గిరి పైనున్న పుస్తకాలవైపు చూశాడు.

"పుస్తకాలు సార్," అన్నాడతను.

"పై పుస్తకాలు తీసి చూడు," అన్నాడు వాలి

భయంకరమైన చప్పుళ్ళు నలువైపులనుంచీ వెలువడ్డాయి. పుస్తకాల కింద నున్న బుడ్డీలను వాలి చూశాడు. నలువైపులనుంచీ పొగ కప్పేస్తోంది!

గిరి కళ్ళు మూసుకున్నాడు.

"బయటకు పరుగెత్తు! వెళ్ళా వద్దాం!" అన్నాడు వాలి.

వాలి, గిరి గేటుదాటి దూరంగా పోయారు. వాళ్ళ కళ్ళమ్మట నీళ్ళు కారుతున్నాయి. లారీ సర్వీస్ కాంపౌండు నలువైపులా పొగ ఆవరించింది.

"టియర్‌గాస్ షెల్స్!" అన్నాడు వాలి.

పొగ మధ్యనుంచి ఒక లారీ వాళ్ళవైపు దూసుకొస్తోంది. గిరి చెయ్యి పట్టుకొని వాలి రోడ్డుకు దూరంగా జరిగాడు.

లారీలో ఎంతమందో నిలబడి వున్నారు. పిస్టల్ చప్పుళ్ల ధన్ ధన్ మారు మ్రోగాయి.

వాలి, గిరి నూతి పక్కన నేలమీద అమాంతంగా పడ్డారు వాళ్ళపైనుంచి బులెట్లు దూసుకుపోయాయి.

లారీ రోడ్డమ్మట వేగంగా వెళ్ళిపోయింది. వాలి లేచి నిలబడ్డాడు. లారీ వెళ్ళిన వేపు చూశాడు. లారీ నంబరు సరిగ్గా కనబడలేదు.

కాంపౌండ్‌లో పొగ సన్నగిల్లింది. వాలి కాంపౌండ్‌లోకి వెళ్ళాడు. యక్స్.వై.జెడ్. కారులో కూర్చున్నాడు. కారును గేటుదాటి పోనిచ్చాడు.

గబగబా వచ్చి గిరి కారులో ఎక్కాడు. వాలి కారును పోనిచ్చాడు.

"గిరీ, వాళ్ళు అన్నింటికీ తెగించి బ్రాందీ బుడ్డీలను యిక్కడకు పట్టుకొస్తున్నారు. మరికొంత బందోబస్తుతో మనం వాళ్ళ ఆఫీసుమీదకు దాడి చెయ్యాలి," అన్నాడు వాలి.

మరో గంటలో లారీ ఆఫీసు కాంపౌండ్‌లో రెండు పోలీసువాన్లు వున్నాయి. నూటయాభై మంది సాయుధ పోలీసులు ఆఫీసు భవనాన్ని చుట్టేశారు.

వాలి కోపంగా లోపలకు వెళ్ళాడు. అతడి వెనక ఇన్‌స్పెక్టర్ కేశవన్, గిరి నడుస్తున్నారు.

ఎలుగుబంటిలా వున్న జాన్ వాళ్ళకు ఎదురయ్యాడు.

"ఇదంతా ఏమిటి సార్!" అడిగాడతను.

"ఈ బిల్డింగ్‌ను సోదా చెయ్యాలి," అన్నాడు వాలి.

"చేసుకోండి." అని జాన్ పక్కకు తప్పుకున్నాడు

ఆరుగంటలపాటు సోదా సాగింది. ప్రతి కర్రపెట్టెనూ, పార్శిల్‌నూ, పాకెట్‌నూ పోలీసులు తెరిచి చూశారు. ఎక్కడా మత్తు ద్రవాలున్న బుడ్డీలు కనిపించలేదు!

"మనం చూసిన బ్రాందీ బుడ్డీలు ఏమైనాయి?" అన్నాడు గిరి.

"గిరీ! అంతా మేజిక్! మనం చూసినదంతా మాయమైపోయింది! మనవైపు షూట్ చేస్తూ ఆ లారీలో వాళ్ళు ఆ గోనిపార్శిల్స్‌ను పట్టుకుపోయి వుంటారు," అన్నాడు వాలి.

"వాలిగారూ, ఈ ఆఫీసులోని వాళ్ళను అరెస్టుచేసి, యీ ఆఫీసును మూయించి సీల్ చేస్తాను," అన్నాడు యిన్‌స్పెక్టర్ కేశవన్.

వాలి అతడివైపు నవ్వుతూ చూశాడు.

"కేశవన్ భాయ్, తొందరపడకు. మనం ఓడిపోయాం. వాళ్ళు జయించారు. ఈ భావం వాళ్ళలో తలెత్తడం మంచిది. మనల్ని కించపర్చామన్న అహంకారం వాళ్ళను ఆఖరున ఓడిస్తుంది," అన్నాడు వాలి.

జాన్ వాళ్ళ ముందుకొచ్చాడు.

"మాది పేరుపొందిన లారీ సర్వీసు, సార్. మమ్మల్ని అనుమానించి, మీరు రెయిడ్ చేయడం ఆశ్చర్యంగా వుంది," అన్నాడతను.

"వుయ్యార్ సారీ! అసత్యవార్తలు మాకు అందాయి. ఇప్పుడు నిజం తెల్సింది," అన్నాడు వాలి.

టియర్‌గస్ షెల్స్ గురించీ, లారీలోని వాళ్ళు షూట్‌చేయడం గురించీ వాలి ఏమీ అడక్కపోడం జాన్ని ఆశ్చర్యపర్చింది!

"నివురు గప్పిన నిప్పులాంటివాడు వాలి," అనుకొన్నాడు జాన్.

* * *

16

చీకటి పడింది. రోడ్డు దీపాలు వెల్గుతున్నాయి. లారీ ఆఫీసు ముందు పేవ్‌మెంటుమీద గిరి పచార్లు చేస్తున్నాడు.

అతడికి కనుచూపుమేర దూరంలో యక్స్. వై. జెడ్. కారు పక్కనే వాలి నిలబడి వున్నాడు. చల్లటి గాలి వీస్తోంది. అప్పుడప్పుడు వాలి దూరంలో వున్న గిరివైపు చూస్తున్నాడు.

తటాలున ఒక అంబాసిడర్ కారు లారీ ఆఫీసు కాంపౌండ్‌లోంచి బయట కొచ్చింది. జాన్ ముఖాన్ని అతడు గుర్తుపట్టాడు. జాన్ డ్రయివర్ పక్కనే కూర్చుని వున్నాడు. వెనుకసీటుమీద కూర్చున్నతడివైపు గిరి చూశాడు. వికృతమైన మొహం! బుచ్చయ్య అతడే అయి వుండాలి!

పాకెట్ టార్చి ఆన్‌చేసి గిరి వాలి వైపు తిప్పాడు. ఆ కాంతిని గమనించి వాలి తన కారును పోనిచ్చాడు. అంబాసిడర్ వెనకనే గిరి తన కారును నడుపుతున్నాడు.

రియర్‌వ్యూ స్పెషల్ మిర్రర్‌లోకి చూశాడు వాలి. తన వెనక మూడు కార్లు వస్తున్నాయి. వాటి మధ్యనున్న అంబాసిడర్‌ను గిరి వెంటాడుతున్నాడని వాలి గ్రహించాడు.

వాలి స్పీడు తగ్గించాడు. వెనుకనున్న కారు ముందుకుపోయింది. ఇప్పుడు అంబాసిడర్ అతడి కారు వెనకనే వుంది!

రోడ్డు జంక్షన్‌లో రెడ్‌లైటు చూసి వాలి కారును ఆపాడు.

అంబాసిడర్ మెల్లిగా కదుల్తోంది.

"బాస్, ముందున్నది వాలిగారి కారు," అన్నాడు ముందు కూర్చున్న జాన్.

"ఆయన మన్ని వెంటాడ్డంలేదు. కారు ముందున వుందిగా!" అన్నాడు బుచ్చయ్య.

"ఎడంవైపు రోడ్డుకు తిరిగి పోదాం," అన్నాడు జాన్.

"ఆల్‌రైట్," అన్నాడు బుచ్చయ్య.

ఎడంవైపుకు వెళ్ళే కార్లకు సిగ్నల్ ఇవ్వబడింది. అంబాసిడర్ వేగంగా కదిలింది. వాలి కారును దాటి ఎడంవైపుకు తిరిగింది. ఆ కారును వాలి వెంబడించాడు.

వెనకనుంచి కారు హారన్ వినపడింది. గిరి కారు ముందుకు దూసుకుపోయి అంబాసిడర్ ముందుకు చేరుకుంది.

ముందు వెళ్తున్న అంబాసిడర్ కారువైపు సూటిగా చూశాడు వాలి. ఒక



బటన్ నొక్కాడు. బోనెట్ మీదున్న గన్ మూడు అంగుళాలు పైకి లేచింది.

వాలి మరో బటన్ని రెండుసార్లు నొక్కాడు. భయంకరమైన చప్పుళ్ళు గాలిలో ధ్వనించాయి. అంబాసిడర్ కారు కొంచెం దూరం వెళ్ళి ఆగిపోయింది

తన కార్లోంచి వాలి బయటకు దూకాడు. అంబాసిడర్ కారువైపు పరుగెత్తాడు. కార్లోంచి దిగిన మనుషులవైపు మూడుసార్లు షూట్ చేశాడు

వెనకసీటుమీదనుంచి దిగినతను కారు పక్కనే పడ్డాడు. వాలి అతడివైపు వెళ్లాడు. నేలమీద పడున్న వ్యక్తి వాలి వైపు షూట్ చేశాడు

వాలి అమాంతంగా పక్కకు జరిగాడు గాలిలో ఎగిరి అతడిమీదకు దూకాడు.

గిరి అక్కడకు పరుగెత్తుకొచ్చాడు. నేలమీద పడున్న వ్యక్తి చేతిలోని పిస్టల్ రెండుసార్లు పేలింది. వాలి అతడివైపు మరోసారి షూట్ చేశాడు. అతడి చేతిలోని పిస్టల్ దూరంగా ఎగిరిపడింది.

అతడిని లేవదీశాడు వాలి వికృత గా వున్న అతడి ముఖంలోకి చూశాడు అతడి కుడిచేతినుంచి రక్తం కార్తోంది

“తతిమ్మావాళ్ళు పారిపోయారు!” అన్నాడు గిరి.

భయంకరంగా పిస్టల్ పేలింది. వాలి ముందున్న వికృతమనిషి నేలమీద కూలిపోయాడు.

రోడ్డు లైటు కాంతిలో అతడిని పరీక్షగా చూశాడు వాలి. బులెట్ అతడి వీపులోంచి లోపలకు దూసుకువెళ్ళింది. అతడు మూలుగుతున్నాడు. రక్తం విశేషంగా కార్తోంది!

నేలమీదకు వంగి అతడివైపు చూశాడు వాలి.

''నీ పేరు ?'' అడిగాడు వాలి.

''బుచ్చయ్య,'' అన్నాడతను.

''ఏదేనా చెప్పాలా?''

''నన్ను ఆమె చంపించింది! నా భార్య! అనూరాధ!'' అని అతడు కళ్లు మూశాడు

గిరి నలువైపులా తతిమ్మావాళ్ళకోసం వెతికి తిరిగొచ్చాడు

''వాళ్ళు ఎక్కడా లేరు సార్,'' అన్నాడు గిరి.

అంబాసిడర్ డిక్కీ తెరిచి చూశాడు వాలి. లోపల డీల్ వుడ్ పెట్టెలున్నాయి పై చెక్కను చేత్తో లాగి, లోపలున్న బ్రాందీబుడ్డీలను వాలి పరీకించాడు.

''గిరీ! ఇన్ స్పెక్టర్ కేశవన్ కి ఫోన్ చేసి వెంటనే యిక్కడకు రమ్మను,'' అన్నాడు వాలి.

గిరి రోడ్డమ్మట నడిచి వెళ్ళిపోయాడు. పదినిముషాల తర్వాత అతడు తిరిగొచ్చాడు. చాలామంది ఆ ప్రాంతంలో గుమిగూడారు

పోలీస్ జీప్ వచ్చి రోడ్డువారగా ఆగింది. ఇన్ స్పెక్టర్ కేశవన్, నలుగురు కానిస్టేబుల్స్ కిందకు దూకారు.

ఇన్ స్పెక్టర్ గబగబా వాలి ముందుకు నడిచాడు

''కేశవన్ భాయ్! ఇతడు మరణించాడు. పేరు బుచ్చయ్య!'' అన్నాడు వాలి.

''మీరు వెతుకుతున్నది ఇతడికోసమేగా ?'' అడిగాడు కేశవన్

''ఇదంతా యితడే చేయిస్తున్నాడని అనుకున్నాను. ఇతడికి బాస్ మరెవరో వున్నారని ఇప్పుడే తెల్సుకున్నాను,'' అన్నాడు వాలి

వాలి పెద్ద అంగల్లో తనకారువైపు నడిచాడు. ''నాకు పనుంది వస్తాను'' అని వాలి కారును పోనిచ్చాడు. వాలి కారువెనకనే గిరి కారు దూసుకుపోయింది.

* * *

17

హోటల్ పారడైజ్ కాంపౌండ్‌లో వాలి కారాపి దిగాడు. గిరి అతడివైపు పరుగెత్తుకొచ్చాడు.

వాలి మౌనంగా ముందు హాల్లోకి వెళ్ళాడు. రిసెప్షన్ కౌంటరు ముందు కెళ్ళి, ఏదో కనుక్కొని, అతడు లిఫ్ట్‌వైపు నడిచాడు.

ఇద్దరూ లిఫ్ట్‌లో ఎనిమిదో అంతస్తుకు చేరుకున్నారు. అందంగావున్న రూఫ్ గార్డెన్‌వైపు వాలి హుషారుగా చూశాడు చల్లటి గాలి కెరటాలు చర్మాన్ని తాకుతున్నాయి.

రూఫ్ గార్డెన్ కుడివైపున నాలుగు గదులున్నాయి. మూసివున్న తలుపు ముందు వాలి ఆగాడు. లైట్లు వెలగడంలేదు. చుట్టూ ప్రశాంతంగా వుంది. వాలి తలుపుమీద వేళ్ళతో తట్టాడు. జవాబు లేదు. మళ్ళీ తట్టాడు – తలుపు తెరవబడింది.

తలుపు తెరిచిన అనూరాధ లోపలకు పరుగెత్తింది విశాలమైన హాల్లో ఫ్లోరసెంట్ దీపాలు వెలుగుతున్నాయి.

వాలి, గిరి లోపలకు వెళ్ళారు.

టీపాయి మీద సిరంజి వుంది. మోర్ఫిన్ పైయాల్స్ పక్కనే వున్నాయి. ఒక పయాల్ పగిలివుంది.

ఆమెకేసి వాలి సూటిగా చూశాడు.

"అమ్మాయ్! నువ్వు డ్రగ్ ఎడిక్ట్‌వని నే ననుకోలేదు," అన్నాడు వాలి.

ఆమె అతడివైపు చూసి పకపక నవ్వింది.

"నే నిక్కడ వున్నానని మీరెలా అనుకున్నారు ?" అందామె

"నీ బాడీగార్డుగా నేను నియమించిన వ్యక్తి ఎప్పటికప్పుడు వార్తలు నా కందిస్తున్నాడు," అన్నాడు వాలి.

"డర్టీ స్నీక్ శేఖర్!" అందామె.

శరీరంలోకి ఇంజక్ట్ చేసుకున్న మోర్ఫిన్ ప్రభావం మూలంగా ఆమె గెంతుతోంది, కిలకిల నవ్వుతోంది.

"హోటల్ పారడైజ్ నీదని నాకు తెలుసు! నీ మొదటిభర్త మూగివాడు కాదు, అతడు బుచ్చయ్యని నాకు తెలుసు! అతడితో ఎక్కువగా మాట్లాడే అవకాశం లేకుండా నీ మనిషి బుచ్చయ్యను షూట్ చేసి చంపాడు!"

ఆమె ఆశ్చర్యపోలేదు గబగబా టీపాయ్ దగ్గర కెళ్ళి సిరంజిని అందుకో బోయింది. వాలి ఆమె చెయ్యిని పట్టుకున్నాడు.

"లీవ్ మి!" అర్చిందామె.

ఆమెను తీసుకెళ్ళి సోఫాలో కూర్చోబెట్టాడు.

అబద్ధాలు చెప్పి నా అనుమానాన్ని బుచ్చయ్య మీదకు పంపావు ! ఇదంతా చేయించేది నువ్వని యిప్పుడు తెలిసింది!"

ఆమె వాలివంక హేళనగా చూసింది.

"ఏం తెలిసింది మీకు ?"

"నువ్వొక రాక్షసివి. నీకు ధనదాహం ఎక్కువ. పెళ్ళాడిన బుచ్చయ్యను వదిలి పారిపోయావు. డబ్బుకోసం మోహనరాజుని పెళ్ళాడావు. బుచ్చయ్య నిన్ను వెతుక్కుంటూ నీ ఇంటికొచ్చాడు. అతడిని బానిసగా చేసి, సంపూర్ణంగా పాడుచేశావు తను చెడ్డ కోతి అందర్నీ చెరిపిందనే సామెత నిజమని నిరూపించావు! మత్తుద్రవాలను తమిళనాడు రాష్ట్రానికి స్మగుల్ చేయిస్తున్నావు! అందుకోసం గోల్డెన్ లారీ సర్వీస్‌ను కొన్నావు! నీ రెండో భర్త మోహనరాజును నువ్వే చంపి వుండొచ్చు!" గర్జించాడు వాలి.

"నా భర్తను బుచ్చయ్య చంపాడు, నేను కాదు!" అందామె

"నీ ప్రేరేపణవలన, నువ్వు ప్రోత్సహించడం మూలంగా అతడు హతమార్చి వుండొచ్చు. అసలు హంతకురాలవు నువ్వే !"

ఆమె మాట్లాడలేదు వాలి వెనక్కి తిరిగాడు.

"గిరీ, ఇన్‌స్పెక్టర్ కేశవన్ని యిక్కడకు రమ్మను" అన్నాడు వాలి.

గదిలోవున్న ఫోన్‌వైపు నడిచాడు గిరి. ఆమె హఠాత్తుగా లేచింది. వాలి ఆమెకేసి చూశాడు.

"బాత్‌రూమ్‌కోకి వెళ్తొస్తాను," అందామె.

వాలి ఆమెను సోదా చేశాడు రహస్యంగా ఆమె దాచుకున్న పిస్టల్ని తీసి, జేబులో పడేసుకున్నాడు.

"ఇప్పుడు వెళ్ళు" అన్నాడు వాలి

"యూ ఆర్ డేంజరస్ మేన్!" అందామె.

"మంచివాళ్ళకు నానుంచి ప్రమాదం లేదు. నీలాటి చెడ్డవాళ్ళకు నేను సింహస్వప్నంగా పరిణమిస్తాను," అన్నాడు వాలి గంభీరంగా.

* * *

18

పడక కుర్చీలో కూర్చున్న వాలి ఎదురుగావున్న ఐ జి. అకిలన్‌వైపు చూశాడు

"వాలిగారూ! అనూరాధ పోలీస్ లాకప్‌లో వుంది. హోటల్ పారడైజ్‌లో లైసెన్స్ లేకుండా నడుపుతున్న బార్‌రూమ్‌ని సీల్ చేశాం. హోటల్ బేస్‌మెంటులో కొన్ని గదులున్నాయి. ఆ గదులనిండా విస్కీ, బ్రాందీ, రమ్, బీర్ బాటిల్సు వున్నాయి. ఆ స్టాకు ఖరీదు లక్షల్లో వుంటుంది. ఆమె సహచరులైన జాన్, మస్తాన్, మీనన్, కామత్‌లను అరెస్టు చేశాం. పెద్దపెట్టున ఈ రాష్ట్రంలోకి మత్తుద్రవాలను స్మగుల్‌చేసే సంస్థ పూర్తిగా ధ్వంసమైంది. ఇటుపైన ఇక్కడ ప్రొహిబిషన్ విజయవంతమవుతుందని నా నమ్మకం," అన్నాడు ఐ. జి.

వాలి తీయగా నవ్వాడు.

"ఆలన్ ఖాన్! మీ పోలీస్ ఉద్యోగులు నాతో అన్నివిధాలా సహకరించారు. వాళ్ళకు నా ధన్యవాదాలు," అన్నాడు వాలి.

గిరి హుషారుగా గదిలో కొచ్చాడు.

"వాలిగారూ, గది బయట ప్రెస్ విలేఖర్లు, ఫోటోగ్రాఫర్లు గుమిగూడారు. టెలివిజన్ యూనిట్ కూడా సిద్ధంగా వుంది," అన్నాడు గిరి.

నవ్వుతూ వాలి కుర్చీలోంచి లేచాడు. నోట్లోవున్న చుట్ట వెలుగుతోంది. పొగ గాలిలో పైకి లేస్తోంది.

"ఈ జీవితంలో విలేఖర్లు, ఫోటోగ్రాఫర్లు వదిలేటట్లులేరు;" అన్నాడు వాలి మందహాసంతో.

టెలిఫోన్ మ్రోగింది. వాలి రిసీవర్ని అందుకున్నాడు.

"వాలి హియర్" అన్నాడు.

"వాలిగారూ! కరుణాకరన్ మాట్లాడుతూంట. ఇప్పుడే నాకు రిపోర్ట్ వచ్చింది. చాలా పెద్ద బూట్‌లెగ్గింగ్ సంస్థను పూర్తిగా నాశనం చేసినందుకు మిమ్మల్ని అభినందిస్తున్నాను," అన్నాడతను.

"కరుణాకరన్ ఖాన్! నాతో అనేకులు యిందుకోసం పాటుపడ్డారు నీ అభినందనలు వాళ్ళందర్కీ ఆనందాన్ని యిస్తాయి," అన్నాడు వాలి.

"రేపు రాత్రి తాజ్ కోరమెండల్లో డిన్నర్ పార్టీ మీకూ, మీ అసిస్టెంట్ గిరికీ ఆరేంజి చేస్తున్నాను. పురప్రముఖు లందరూ ఆ పార్టీకి రానున్నారు. మీరు ఎనిమిదింటికల్లా అక్కడ వుండాలి."

"సరిగ్గా ఎనిమిదింటికి అక్కడుంటాను. ఎవరి వాచీలైనా ఎనిమిది దాటినట్లు చూపిస్తే వాళ్ళు టైము దిద్దుకోవాలి," అన్నాడు వాలి మందహాసంతో.

— — —